

నేడు ఐఏబీ సమావేశం

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన భవన్‌లో జరగనుంది. కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొనాలని నీటిపారుదల శాఖ ఎస్ఈ దేశానాయక్ ఒక ప్రకటనలో కోరారు. 2024-25 ఖరీఫ్ సాగుకు గాను సోమశిల, కండలేరు జలాశయాల నుంచి తాగు, సాగునీరు, ఇతర అవసరాలకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

త్వరలోనే నైపుణ్య గణన

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం ● ఎమ్పీడీవోలు, సచివాలయ సిబ్బందికి శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యువతలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి, వారికి ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు నైపుణ్య గణన చేపట్టాలని నిర్ణయించి, ఆ మేరకు త్వరలో తేదీ ప్రకటించనుంది. నైపుణ్య గణన ఎలా చేయాలనే అంశంపై ఇప్పటికే జిల్లాలోని ఎమ్పీడీవోలకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇద్దరు ఎమ్పీడీవోలు, మరో ఇద్దరు సచివాలయ సిబ్బందిని మాస్టర్ ట్రైనర్లుగా ఎంపిక చేసి, వీరి ద్వారా సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.



● సచివాలయం ఒక క్లస్టర్‌గా

పట్టణ, గ్రామాలలో ఒక్కో సచివాలయాన్ని క్లస్టర్‌గా విభజించి మ్యాపింగ్ చేస్తారు. ఆధార్ నెంబరు ఆధారంగా చేస్తున్న ఈ సర్వేలో ఒకరి వివరాలు ఒకేసారి మాత్రమే నమోదవుతాయి. ఈ గణనలో 15-59 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారి విద్యార్హత, కుటుంబ నేపథ్యం తదితర వివరాలు సేకరిస్తారు. ఈ వివరాలన్నీ సచివాలయ ఉద్యోగులు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేస్తారు. గణన పూర్తయ్యాక ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేక ఖాతా సిద్ధం చేయనున్నట్లు సమాచారం. మరోవైపు జిల్లాలోని పరిశ్రమల పరిశ్రమల గణన కూడా సమాంతరంగా జరుగుతుంది. నైపుణ్య గణనలో యువత నైపుణ్యాలను నమోదు చేసి పరిశ్రమల యాజమాన్యానికి పంపుతారు. వీరు తమకు అవసరమైన మేరకు యువతను ఎంపిక చేసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ సర్వే జరగనుంది. ఇంటింటికి వెళ్లి సర్వే చేయడం, పోర్టల్ ద్వారా అభ్యర్థులే తమ వివరాలు నమోదు చేసుకోవడం, కళాశాలలు, విద్యా సంస్థలలో విద్యార్థులు తమ వివరాలు నమోదు చేయటం ద్వారా నైపుణ్యగణన పూర్తి చేస్తారు. ఈ నెల రెండో వారం నుంచి ఈ నైపుణ్య గణన ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



నైపుణ్య గణనకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలను ఎంపీడీఓలకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించాం. వీరిలో మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి మండల స్థాయిలో శిక్షణ ఇప్పిస్తున్నాము. త్వరలో నైపుణ్య గణనకు సంబంధించి ప్రభుత్వం తేదీని ప్రకటించనుంది. ఆ తర్వాత సర్వే మొదలవుతుంది.

- షేక్ అబ్దుల్ కయ్యూం,
జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

14 నుంచి కేన్సర్ స్క్రీనింగ్

- వివరాలు 7లో



నేర శోధన.. వీటితోనే సాధన

పోలీస్ డాగ్స్.. ఈ పేరు వింటే చాలు. దాదాపు నేర పరిశోధన ఓ కొలిక్కి వచ్చినట్టే. హత్యలు మొదలు, దోపిడీలు, చోరీలు ఇలా ఘటనలు ఏవైనా సరే విచారణలో పోలీసులకు వీటి తోడు ఉండాల్సిందే. ఘటనాస్థలిలో వాసనతో మొదలై నిందితులను గుర్తించడంలో వీటికి ఇవే సాటి. పేలుడు పదార్థాల గుర్తింపులోనూ వీటి చాకచక్యం అమోఘం. అందుకే కనిపించని నాల్గవ సింహంగా చెప్పుకునే పోలీసుల విధుల్లో స్నేహితులుగా మెలుగుతున్నాయి. జన్మించిన రెండు నెలల వయసు నుంచే పోలీస్ శిక్షణ పొంది చనిపోయే దాకా అలుపెరగని సేవలు అందిస్తున్నాయి. అలాంటి పోలీస్ డాగ్స్‌పై ప్రత్యేక కథనం...

వివరాలు 6

6 పొగనారుకు పెరిగిన డిమాండ్

ఎస్ఏలకు హెచ్ఎంలుగా పదోన్నతి

నెల్లూరు(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాఠశాలల్లో నలుగురు స్కూల్ అసిస్టెంట్లకు సీనియారిటీ ప్రాతిపదికన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం రాత్రి డీఈఓ బాలాజీరావు ఆధ్వర్యంలో సీనియారిటీ జాబితాలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతలు నిర్వహించారు. వెంటనే సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వులు అందించారు.

● నేడు సర్టిఫికెట్ల పరిశీలన

మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలనకు ఆహ్వానించినట్లు డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లు పరిశీలిస్తామని, సంబంధిత ఉపాధ్యాయులు హాజరు కావాలని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌లతోపాటు పీఈటీలకు పీడీలుగా పదోన్నతులు కల్పిస్తామన్నారు. అన్ని సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలను సమర్పించాలని, చెక్‌లిస్ట్‌లో హెచ్ఎం, ఎంఈఓల ధ్రువీకరణ ఖచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు.

గ్యాస్ వినియోగదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలి : జేసీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వంట గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ(ఆధార్ అనుసంధానం) చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈకేవైసీ చేయ కపోతే దీపం-2 పథకానికి అనర్హులౌతారనేది అపోహ మాత్రమేనన్నారు. దీపం-1 పథకంలోని లబ్ధిదారులు, ఉజ్వల, సీఎస్ఆర్, జనరల్ కేటగిరి లబ్ధిదా రులందరూ ప్రస్తుత పథకానికి అర్హులేనని స్పష్టం చేశారు. వారి అర్హతల మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పొందవచ్చని చెప్పారు. గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ వద్ద ఉన్న మొబైల్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉచిత సిలిండర్ కోసం 99,837 మంది బుకింగ్ చేసుకున్నారని, ఇందులో 59,937 మందికి సిలిండర్ డెలివరీ చేసి, సబ్సిడీ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. దీపం-2 పథకం గురించి ప్రజల అనుమానాలు నివృత్తి చేసుకొనేందుకు 1967 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక సచివాలయాల ద్వారా నేరుగా సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అటువంటి సమస్యలను ప్రత్యేక నెట్ వర్క్ ద్వారా వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్వో డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కోటా..

ఉజ్వల భవితకు బాట

● నూతన క్రీడా పాలసీని ప్రకటించిన కూటమి ప్రభుత్వం
● భారీగా నగదు ప్రోత్సాహకాలు
● ప్రభుత్వ కొలువుల్లో 3 శాతం రిజర్వేషన్
● శిక్షకులు, క్రీడాకారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. జీవితంలో స్థిరపడేందుకు క్రీడలు దోహదం చేస్తుండటంతో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతూ తమ బిడ్డలకు వారికి నచ్చిన క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఏ ప్రాంతంలో పోటీలు జరుగుతున్నా తల్లిదండ్రులే స్వయంగా తీసుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన స్పోర్ట్స్ పాలసీని ప్రకటించారు. రాష్ట్రం నుంచి ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్, జాతీయస్థాయిలో, ఖేలో ఇండియా జాతీయ క్రీడల్లో తొలి మూడుస్థానాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు భారీగా నగదు ప్రోత్సాహకాలు ప్రకటించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద ప్రస్తుతం అమలవుతున్న 2శాతం ఉద్యోగాలను 3శాతానికి పెంచారు. వీటితోపాటు అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడాకారులకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థలో క్రీడా శిక్షకుల నియామకాల్లో 50 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించారు. రానున్న 3-4 సంవత్సరాల్లో రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని ప్రభుత్వం ప్రకటించడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● క్రీడలకు పూర్వ వైభవం

వైసీపీ హయాంలో క్రీడారంగం నిర్వీర్యమైపోవడంతో పాటు ఎంతోమంది క్రీడలకు దూరమయ్యారు. అంతేగా ఉద్యోగాలకు సంబంధించి కొన్ని క్రీడాంశాలను కోటాలో తీసేయడంతో క్రీడాకారులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించడం, క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ స్పోర్ట్స్ పాలసీని ప్రకటించడంతో క్రీడలకు పూర్వవైభవం రానుందని క్రీడాకారులు, క్రీడా ప్రముఖులు చెపుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పలు క్రీడా వసతులు అందుబాటులో ఉండగా, రానున్న రోజుల్లో మొగళ్లపాళెం అంతర్జాతీయ క్రీడామైదానం, అన్ని నియోజక వర్గాల్లో క్రీడావికాస కేంద్రాలు కూడా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో నెల్లూరుజిల్లా క్రీడలకు నిలయంగా మారనుందని క్రీడా ప్రముఖులు తెలిపారు. అలాగే గతంలో ఉన్న అకాడమీలు తిరిగి ప్రారంభించేందుకు, కొత్త అకాడమీల ఏర్పాటుకు ప్రతిపాదనలు కూడా పంపించడం, వీటికి రాష్ట్ర ఉన్నతాధికారులు, శాప్ చైర్మన్ సైతం సుముఖత వ్యక్తం చేయడం క్రీడాభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

రాష్ట్రానికి చెందిన పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్‌లు అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటారు. వీరి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌లుగా పోస్టింగ్‌లు ఇచ్చింది. అలాగే విలువిద్యలో జ్యోతి సురేఖ అత్యుత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొందడంతో ఆమె ప్రతిభకు గుర్తింపుగా గ్రూప్-1లో ఉద్యోగం లభించింది. ఇలా ఎంతో మంది క్రీడాకారులు స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు నూతన స్పోర్ట్స్ పాలసీని ప్రకటించడంతో క్రీడాలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. క్రీడాకారులకు భారీ నగదు ప్రోత్సాహంతోపాటు 2శాతం ఉన్న ఉద్యోగాల స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచడంపై క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



క్రీడాచరిత్రలో ఎన్నడూ లేని విధంగా



క్రీడారంగ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తూ భారీ నగదు ప్రోత్సాహకాలు, ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్ లను సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షనీయం. క్రీడలపై మరింత ఆసక్తి పెరగడంతోపాటు క్రీడలకు ప్రాధాన్యత పెరిగి జిల్లాలో క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుంది.

- ఆర్‌కె.యతిరాజ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి

క్రీడాకారులకు ప్రోత్సాహం



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహంతో పేద, మధ్య తరగతి క్రీడాకారులకు చేయూత దొరికింది. చిన్నతనం నుంచి క్రీడలపై ఉన్న మక్కువతో ఎంతో ఇష్టమైన ఫుట్‌బాల్ క్రీడలో సాధన చేసి జాతీయ స్థాయిలో రాణిస్తున్నా. రాష్ట్ర, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించడంతోపాటు కీలకమైన సంతోష్ ట్రోఫీలో పాల్గొనడం గర్వకారణంగా ఉంది.

- ప్రకాష్, జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు

అంతర్జాతీయ పతకాలే లక్ష్యం



అంగవైకల్యం క్రీడలకు అడ్డురాదని నిరూపిస్తూ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాను. క్రీడలకు ఉన్న ప్రాముఖ్యతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పాలసీ ప్రకటించడం ఆనందంగా ఉంది. ఎంతోమంది క్రీడాకారులకు ఈ ప్రకటన ఆనందం కలిగిస్తుంది. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింత ఉత్తమ సాధనతో పతకాలే లక్ష్యంగా రాణిస్తాను.

- భవాని,
అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడాకారిణి

బెల్టుషాపులపై ఎక్సైజ్ దాడులు

నెల్లూరు(క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్నీ ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో గల బెల్టు దుకాణాలపై గురువారం అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. 13 బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 13 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డీసీ టీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని 182 మద్యం షాపుల యజమానులు ఎక్సైజ్ నిబంధనల మేరకు వ్యాపారం నిర్వహించుకోవాలన్నారు. బెల్టుషాపుల నిర్వహణ, ఎమ్మార్పీ ఉల్లంఘన, సమయ పాలనపై నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చినప్పటి నుంచి గురువారం వరకు 62 బెల్టు షాపులపై దాడులు చేసి 62 మందిని అరెస్టు చేశామని, 145.62 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.

● మద్యం సీసాల స్వాధీనం

ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 60 మద్యం సీసాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గద్దె తివిక్రమ్ వద్ద 30 మద్యం సీసాలు, ఎస్ పవన్ వద్ద 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్‌డీ కాలేషావలి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి జిల్లా సాధనే లక్ష్యం
● భారీ ప్రదర్శన, మానవహారం 6



నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ గురువారం పల్లకీ సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకుముందు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి చందన అలంకారం, అభిషేకాలు, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- దుత్తలూరు (ఉదయగిరి రూరల్, ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి కార్తీక లక్ష దీపోత్సవం



నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో శుక్రవారం కార్తీక లక్ష దీపోత్సవం జరగనుంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతుల సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు ఈ వేడుక జరగనుంది. భారీ సెట్టింగులు, విద్యుద్దీపాలతో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యే దీపోత్సవాలు, 10వతేదీ రాత్రి శివపార్వతుల శాంతి కల్యాణంతో ముగియనున్నాయి. ప్రతిరోజూ ఉదయం విశేష అభిషేకాలు, పూజలు, హోమాలు, సాయంత్రం దీపోత్సవం జరుపుతారు. తొలిరోజు సాయంత్రం ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం జరగనుంది. కాగా, ఈ లక్షదీపోత్సవ ఏర్పాట్లను వేమిరెడ్డి దంపతులు గురువారం రాత్రి పరిశీలించారు. కార్యనిర్వాహక కమిటీకి పలు సూచనలు చేశారు. వర్షం వచ్చినా భక్తులు కార్తీక దీపారాధన చేసుకునేలా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిరాటంకంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)





నేర శోధన.. వీటితోనే సాధన

- పోలీసుల స్నేహితులు.. ఈ శునకాలు
- రెండు నెలల వయసు నుంచే శిక్షణ
- బెల్ట్ వేస్తే ఆన్‌డ్యూటీ అని అర్థమయ్యేలా సాధన
- హ్యాండలర్స్ మాటే వేదవాక్కుగా విధులు

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. హత్యలు, చోరీలు, దోపిడీలు, పేలుడు పదార్థాల గుర్తింపు ఇలా ఘటనలు ఏవి జరిగినా నేర పరిశోధనకు పోలీస్ డాగ్స్ (శునకాలు) కీలకంగా మారుతున్నాయి. వీఐపీలు, వీవీఐపీల పర్యటనల సందర్భంలోనూ పోలీస్ డాగ్ స్క్వాడ్ వారు పర్యటించే ప్రాంతాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇలా పోలీసుల విచారణలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తూ నాల్గవ సింహాలుగా పేరు గడించాయి. జన్మించిన రెండు నెలల వయసు నుంచే పోలీస్ శిక్షణలో భాగస్వామ్యం అవుతాయి. చనిపోయే వరకు దేశం కోసం అలుపెరగని సేవలు అందిస్తాయి. అలాంటి శునకాల గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

రెండు నెలల వయసు ఉన్న కుక్కపిల్లలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఆ సమయంలోనే సదరు కుక్కపిల్లల తల్లి, తండ్రి, తాతలు ఇలా నాలుగు తరాల వరకు పరిశీలిస్తారు. వాటి జీన్స్ అన్నిటికి అనుకూలిస్తేనే ఆ డాగ్‌ను కొనుగోలు చేస్తారు. ఒక డాగ్ కొనుగోలు చేస్తున్న సమయంలోనే అది ఏ జిల్లాకు పంపాలో నిర్ణయించుకొని ఆ జిల్లా నుంచి హ్యాండ్‌లర్స్‌ను (శిక్షకుడు) డాగ్‌కు శిక్షణ ఇచ్చే కేంద్రం వద్దకు పిలిపిస్తారు. డాగ్స్‌కు శిక్షణ ఇచ్చే కేంద్రం హైదరాబాదులోని మొయినాబాదులో ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత మంగళగిరిలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెండు నెలల వయసులో శిక్షణ కేంద్రానికి చేరుకున్న డాగ్‌కు ఓ పేరు పెడతారు. ఎనిమిది నెలలపాటు శిక్షణ ఉంటుంది. మొదటి రెండు నెలలు హ్యాండ్‌లర్స్‌తో మమేకం కావడం, మరో రెండు నెలలు ఒబిడియన్స్, మిగిలిన నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుంది. నార్కొటిక్, ట్రాకర్, ఎక్స్‌ప్లోజివ్, ఎర్రచందనం ఇలా పలు రంగాల్లో శిక్షణ ఇస్తారు. తర్వాత ఆయా జిల్లాలకు డాగ్స్‌ను పంపుతారు.

● దినచర్య ఇలా...

జిల్లాలో నాలుగు ఎక్స్‌ప్లోజివ్, రెండు ట్రాకర్ డాగ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు రిటైర్డ్ అయిన రెండు మరో డాగ్‌లు ఉన్నాయి. డాగ్ స్క్వాడ్‌కు 9 మంది హ్యాండ్‌లర్స్, ఇద్దరు స్పేర్ హ్యాండ్‌లర్స్ ఉంటారు. అధికారులుగా ఆర్ఐ, డీఎస్పీ, ఏఎస్పీలు ఇద్దరు ఉంటారు. ఉదయం 6 గంటలకు డాగ్స్‌ను నిద్రలేపుతారు. అనంతరం పోలీస్ మైదానంలో శిక్షణ మొదలవుతుంది. 7.30 గంటలకు ఏఆర్ పోలీసు ఆఫీస్‌లో ఉన్న డాగ్ కెనాల్స్‌కు చేరుకుంటాయి. అరగంట విశ్రాంతి తర్వాత 8.30 గంటలకు రాయల్ కేనాల్ ఫీడ్‌ను 250 గ్రామాలు చొప్పున అందిస్తారు. 12.30 గంటలకు డాగ్స్‌ను బయటకు వదిలి కాలకృత్యాలు (టూల్స్) పూర్తి చేయించి నీరు తాగిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మళ్లీ 250 గ్రాముల ఫీడ్ అందిస్తారు. ఇక డాగ్స్ నిద్రపోయేందుకు కేనాల్స్‌లో కూలర్, ఫ్యాన్ తప్పని సరిగా ఉంటుంది. ఒక్కో శునకానికి ఒక్కో గది ఉంటుంది. ముఖ్యమంత్రి, మంత్రులు, పెద్ద జాతరలు, ఉత్సవాలు వంటివి జరిగినప్పుడు డాగ్స్ విధి నిర్వహణలో ఉంటాయి. మన జిల్లాతోపాటు ఇతర జిల్లాలోను వీటి సేవలను ఉపయోగిస్తుంటారు.

● హ్యాండ్‌లర్స్ డాగ్స్ ప్రపంచం

రెండు నెలల వయసు నుంచే కుక్కపిల్ల హ్యాండ్‌లర్ కనుసైగల్లో పెరుగుతుంది. సరిగ్గా పదినెలలు పూర్తయ్యాక విధులకు హాజరవుతోంది. అప్పటి నుంచి ఆ హ్యాండ్‌లరే ప్రపంచంగా అది జీవిస్తుంది. నిత్యం వృత్తిలో సేవాలు అందించేందుకు డాగ్స్ తహతహలాడుతాయి. హ్యాండ్‌లర్స్ సూచనలు పాటిస్తూ దోషులను పట్టించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. హ్యాండ్‌లర్‌కు, డాగ్‌కు మధ్య ఉన్న అనుబంధం ఒక మాటలో చెప్పాలంటే వారు ఫీడ్ (మేత) పెట్టకుండా డాగ్స్ ఒక్క పూట కూడా ముద్ద ముట్టవు. హ్యాండ్‌లర్స్ కూడా అంతే ప్రేమతో ఉంటారు.



● 42 రోజులపాటు సెలవులు

శునకాలకు 42 రోజులాటు సెలవులు కేటాయిస్తారు. ఒక్కసారి డాగ్ స్క్వాడ్‌లో డాగ్ వచ్చిన తర్వాత ఇక శారీరక జీవితానికి అవి దూరం కావాల్సిందే. మగదానికి మెంటింగ్, ఆడదానికి క్రాసింగ్ చేయడం జరగదు. ఆరు నెలలకు ఒకసారి డాగ్స్‌కు 21రోజులపాటు హీట్ పీరిడ్ ఉంటుంది. ఈ పీరిడ్‌లో డాగ్స్‌ను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు.

● బెల్టు పడితే డ్యూటీ ఎక్కినట్లే

పోలీసులు యూనిఫాం వేసుకుంటే డ్యూటీలో ఉన్నట్లుగా ఎలా భావిస్తారో.. డాగ్స్‌కు బాడీ బెల్టు (హార్నిస్) వేస్తే డ్యూటీలో ఇవి జాయిన్ అయినట్లు భావిస్తాయి. బెల్టు తీసేంత వరకు విధి నిర్వహణలో నిమగ్నమవుతాయి. హ్యాండ్‌లర్ చెప్పిన విధంగా నడుచుకుంటూ జాగ్రత్తగా విధులు నిర్వహిస్తాయి.

● జిల్లాలో నాలుగు డాగ్స్ మృతి

సహజంగా డాగ్స్ పది నెలల వయసులో విధిలో చేరినప్పటికి పది సంవత్సరాలు తర్వాత రిటైర్డ్ అవ్వాల్సిన పరిస్థితి. అయితే డాక్టర్ సూచనల మేరకు వాటిని విధుల్లో పొడిగించే అవకాశం కూడా ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు డ్యానీ, హెక్టార్ డాగ్స్ మృతివాత పడ్డాయి. 2014లో డ్యాని మృతి చెందగా, 2018లో హెక్టార్ మృతి చెందినప్పుడు అప్పటి ఎస్పీ రామకృష్ణతో పాటు పలువురు ఉన్నతాధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరులో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఓ డాగ్ అవిశ్రాంతంగా పని చేసి హీట్‌కు గురై మృతి చెందింది. ఆ తరువాత మరో డాగ్ అనారోగ్యంతో మృతి చెందింది.

నోట్ : వీటితోపాటు 2023 బ్యాచ్‌లో గుంటూరులో శిక్షణ పొందుతున్న డాగ్స్‌లో డానీను జిల్లాకు కేటాయించారు. సహజంగా డాగ్స్ ఇప్పటి వరకు స్నాకర్, ట్రాకర్ వేర్వేరుగా విధులు నిర్వహిస్తుంటాయి. అయితే డానీకి రెండింటినీ చూడగలిగే సామర్థ్యం ఉంది.

2014లో నగరంలోని ఎస్‌టూ సినిమా థియేటర్ ఎదురుగా ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించింది. అక్కడ నుంచి మృతుడి అత్త, భార్య వద్దకు వెళ్లి నిలుచుంది. దీంతో పోలీసులు వారిని విచారించగా దోషులు ఇంటివారేనని తేలిపోయింది.

2014లో ఆత్మకూరు ప్రాంతంలో ఓ పెళ్లి ఇంట్లో నగలు ఉన్న బ్యాగ్ దొంగతనానికి గురైంది. ఇంట్లో అందరూ బంధువులే ఉండటంతో ఎవరు దంగతనానికి పాల్పడ్డారో తెలుసుకోవడం కుటుంబ సభ్యులకు, పోలీసులకు కష్టంగా మారింది. అప్పుడే డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగింది. అనుమానితులుగా ఉన్న ఏడుగురిని పోలీసు డాగ్ (లక్కీ) ఎదుట నిలబెట్టారు. డాగ్ తమవైపు రావడాన్ని గమనించి దోషి తానే దొంగతనం చేశానంటూ ఒప్పుకున్నాడు.

2017లో నాయుడుపేటలో ఓ వ్యక్తిని బండ రాయితో కొట్టి చంపి అక్కడే నిప్పంటించి తగలబెట్టారు. పోలీసులు విచారిస్తున్న సమయంలోనే డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుంది. రంగంలోకి దిగిన డాగ్ బింధు బండరాయి వద్దకు వెళ్లి అక్కడ నుంచి నేరుగా పక్కనే ఉన్న ఓ గుడిసె వద్దకు చేరుకుంది. అక్కడే తిరుగుతూ ఉండటంతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఇంకేముంది.. దోసి అతడేనని తేలిపోయింది.

డాగ్ పేరు	పుట్టిన రోజు	వయసు	బ్రీడ్	డ్యూటీ	హ్యాండలర్
బింధు (రిటైర్డ్)	22-10-2013	11	జీఎస్‌డీ	ట్రాకర్	బీ సురేష్
గోల్డీ	22-10-2014	10	ల్యాబ్	స్నైపర్	బీ సురేష్
ఏంజిల్	28-02-2018	6. 8 నెలలు	ల్యాబ్	స్నైపర్	ఎం.రాజశేఖర్
రాక్సీ	03-07-2019	5.3 నెలలు	బెల్జియం	ట్రాకర్	సీహెచ్ రమేష్‌బాబు
సింధు (రిటైర్డ్)	27-07-2011	13.3 నెలలు	ల్యాబ్	స్నైపర్	సీహెచ్ రమేష్ బాబు
స్వీటీ	12-02-2019	5.8 నెలలు	ల్యాబ్	స్నైపర్	వీ హేమంత్‌కుమార్
షాడో	04-01-2019	5.9 నెలలు	బెల్జియం	ట్రాకర్	ఎం. రవి
కైరో	20-05-2017	7.5 నెలలు	బెల్జియం	స్నైపర్	ఎన్. తిరుపతి

ఉదయగిరి జిల్లా సాధనకు ఉద్యమం ఉధృతం

● జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్



మానవహారంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉదయగిరి జిల్లా సాధన కోసం ఉద్య మాన్ని ఉధృతం చేస్తున్నట్లు జిల్లా సాధన సమితి అధ్య క్షుడు డాక్టర్ కె.వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఉదయగిరి జిల్లా సాధన కోసం ఉద్యోగులు, ప్రజలు, ప్రజాసంఘాలు, విద్యా ర్థులతో కలిసి గురువారం పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం విలేరులతో వేణుగోపాల్ మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని 21 మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలని ఐదేళ్లు ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఉదయగిరిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దృష్టిలో నెల్లూరు జిల్లా ఆర్థికంగా ఉన్నా మనం ఉదయగిరి మాత్రం వివక్షకు గురవుతోందన్నారు. జిల్లా సాధనకు ప్రజాప్రతినిధులు అందరూ సమష్టిగా ఉద్యమిస్తేనే సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో జిల్లా సాధన సమితి సభ్యులు దస్తగిరి అహ్మద్, షేక్‌ఎండీ ఖాజా, గాజులపల్లి రామిరెడ్డి, రామచంద్రమూర్తి, సయ్యద్ జాఫర్ మొహిద్దీన్, జీ.ఓబులరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బకీరు జాషువా తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు

కావలి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నా యి. గురువారం రెండోరోజు జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో జిల్లా జట్ల మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీలు సాగాయి. మొదటి క్వార్టర్ ఫైనల్ పోటీలో నెల్లూరు జిల్లా జట్టు కర్నూలు జిల్లా జట్టుపై 20-16 స్కోర్‌తో, రెండో క్వార్టర్‌లో ఈస్ట్ గోదావరి జట్టు చిత్తూరు జట్టుపై 3-14 స్కోర్‌తో, మూడో క్వార్టర్‌లో శ్రీకాకుళం జట్టు విజయనగరం జట్టుపై 24-15 స్కోర్‌తో నాలుగో క్వార్టర్‌లో కృష్ణ జట్టు అనంతపూర్ జట్టుపై 25-20 స్కోర్లతో గెలిచి సెమీఫైనల్స్‌కు ప్రవేశించాయి. మొదటి సెమీఫైనల్స్‌లో ఈస్ట్‌గోదావరి, నెల్లూరు జిల్లా జట్లు తలపడగా 34-25 స్కోర్‌తో ఈస్ట్‌గోదావరి జట్టు గెలిచి ఫైనల్స్‌కు ప్రవేశించింది. ఆట ప్రారంభానికి ముందు డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. శుక్రవారం రెండో సెమిఫైనల్స్ ఫైనల్స్ జరుగుతాయని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు దామోదర్ తెలిపారు. ఆయన వెంట ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీరేష్, అబ్జర్వర్ సత్యనారాయణ, జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

హాస్టల్ వాచ్‌మన్ బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు7: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలతో వారిని వేకువజామునే నిద్రలేపి ఇబ్బందులకు గురిచేయడంపై గురువారం 'విద్యార్థులపై కక్ష సాధింపా ?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ స్పందించారు. హాస్టల్ వాచ్‌మన్ ప్రసాద్‌ను జిల్లా కార్యాలయానికి పంపించాలని వార్డెన్ సునీల్‌ను ఆదేశించారు. ఈమేరకు వార్డెన్ వాచ్‌మన్‌ను నెల్లూరు కార్యాలయానికి పంపించగా, బుచ్చి నుంచి నెల్లూరుకి బదిలీ చేసినట్లు తెలిసింది.



కలిగిరి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పథకాల అమలుపై కలెక్టరు ఆరా

కలిగిరి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): వెలగపాడు పంచాయతీలో గురువారం కలెక్టరు ఆనంద్ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు పరిశీలించారు. నిర్మాణంలోని గోకులం షెడ్డు పరిశీలించి, నిర్మాణానికయ్యే ఖర్చు, పాడిపశువుల పోషణ లాభనష్టాల వివరాలను అడిగితెలుసుకున్నారు. సోమశిల జలాల నీరు చెరువులకు రానివ్వకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు రైతులు కలెక్టరు దృష్టికి తీసుకొ చ్చారు. నారాయణపురం నిమ్మతోటలను పరిశీలించి ఉద్యాన శాఖ నుంచి అందే రాయితీల సద్వినియోగంపై నిమ్మ సాగురైతులను అడిగి తెలుసుకున్నారు. పలువురు సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ప్రాధాన్యత మంజూరు చేస్తామని వారికి వివరించారు. తహసీల్దారు రవీంద్ర బాబు, ఎంపీడీఓ ప్రత్యూష, సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యతో పాటు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

జలదంకి : పల్లెపండుగలో భాగంగా బ్రాహ్మణక్రాక పంచాయతీ 9వ మైలు గ్రామంలో రూ.10లక్షల ఉపాధి నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న జడ్పీహైస్కూల్ అదనపు తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మరుగుదొడ్లను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, కావలి ఆర్డీఓ వంశీక్రిష్ణ, తహసీల్దారు ప్రమీల, డ్వామా పీడీ గంగాభవాని, పీఆర్ఎఈ వాణి, ఎంఈఓ నాగేశ్వరరావు ఎంపీడీఓ బ్రహ్మయ్య, నేతలు మధురెడ్డి మాల్యాద్రిరెడ్డి ఉన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలకు దరఖాస్తుల ఆహ్వానం



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సిమ్ రీచార్జీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఫ్రాంచైజీకి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ అధికారి రామ్మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 14 లోపు నగరంలోని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో మార్కెటింగ్ మేనేజర్‌కు అందజేయాలని కోరారు. అల్లూరు, విడవలూరు, కొడవలూరు, కోవూరు మండలాల్లో ఫ్రాంచైజీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలోని మార్కెటింగ్ మేనేజర్‌ని సంప్రదించాలని కోరారు.



పొగనారుకు పెరిగిన డిమాండ్

● మూట ధర రూ.4వేల నుంచి 4,500

లింగసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేసిన పొగనారుకు డిమాండ్ పెరిగింది. పొగనారు మూట రూ.4వేల నుంచి రూ.4,500లకు పలుకుతోంది. ఈ పంట సాగు చేస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సాగు చేసిన పొగాకు ఒక క్వింటం రూ.35వేలు పలకడంతో ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. పలు గ్రామాల రైతులు నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని గ్రామాలకు వెళ్లి ఉపయోగంలో లేని బ్యారన్‌ల లైసెన్సులను లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసి నిర్మిస్తున్నారు. దీంతో పొగనారు సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే గతంలో కురిసిన వర్షాలకు పొగనారు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు మరలా పొగనారు సాగు చేయడంతో మూట పొగనారు ధర కూడా రెండింతలు అయ్యింది. అయితే 20రోజుల క్రితం కేవలం రూ.2వేలు మాత్రమే ఉంది. ఇప్పుడు ఆ ధర రెండింతలు పైనే పెరింగింది. పొగాకు ధరలు పెరగడంతో పొగనారుమడులు, నాట్లు సాగుకు కూలీలకు, దుక్కులకు, ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా పెరిగాయి.

పెంట్రాలలో సాగు చేసిన పొగనారుమడులు



ఈ గోతాలను గమనించండి. ఇవి ఆషామాషీ మూటలు కావండోయ్. రూ.లక్షల ఉపాధి పనుల అవినీతి చిట్టా ఇందుల్లోనే ఉంది. గత సంవత్సరంలో మనుబోలు మండలంలో జరిగిన ఉపాధి పనులపై గతనెలలో పదిరోజులపాటు సామాజిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు పూర్తయిన రెండు, మూడు రోజులకే బహిరంగసభ ద్వారా నివేదికలు చదివి ఎవరెవరు ఏమేరకు అవినీతి చేశారన్నది బయటపెడతారు. కానీ ఈ సారి బహిరంగసభ నిర్వహించేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వలేదట. దీంతో తనిఖీ బృందాలు ' మీ రికార్డులు... మీ దగ్గరే ఉంచుకోండి' అని గోతాల్లో ఇలా సర్దేసి వెళ్లిపోయారు. నివేదికలు బయటపెట్టి నష్టపోయిన కూలీలకు న్యాయం చేస్తారా, లేక కాలయాపన చేస్తారా..? వేచి చూద్దాం.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

వైద్య ఆరోగ్య శాఖ పాతభవనంలో మంటలు



వైద్య ఆరోగ్యశాఖ పాత భవనంలో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. అందులో దోమల నిర్మూలనకు ఉపయోగించే మందు, కాలువల్లో చల్లే మడ్డి చమురు డ్రమ్ములు నిల్వ ఉంచారు. వాటికి మంటలు అంటుకుని పెద్ద ఎత్తున వ్యాపించాయి. దీంతో భవనం కొంత మేర తగులబడింది. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ భవనం నిరుపయోగంగా ఉండటంతో అధికారులు ఊపిరిపీల్చు కున్నారు. అయితే ప్రమాదానికి కారణాలపై విచారణ జరుపుతున్నారు. పాత భవనం పక్కనే చలిమంట వేసుకున్న కొందరు బయటివ్యక్తులు ఆ మంటలను భవనానికి అంటించినట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. కాగా, ఈ పాత భవనాలను తొలగించేందుకు త్వరలో టెండర్లు పిలుస్తున్నామని డీఎంహెచ్‌వో తెలిపారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)



ఫ్లెక్సీలకు ఓ బ'స్టాండ్'

మామూలుగా ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు, ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి తిరిగి వస్తే దిగేందుకు ప్రభుత్వం ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లను ఏర్పాటు చేస్తారు. కానీ జలదంకిలో మండలంలో అలా లేదండీ. నాయకుల ఫ్లెక్సీల ఏర్పాటుకు కోసమే ఓ బస్టాండ్ ఏర్పాటు చేసినట్లు ఉందండి. కావాలంటే మీరు ఈ ఫొటోను చూడండీ మీకే అర్థం అవుతుంది.

- జలదంకి, (ఆంధ్రజ్యోతి)

డిగ్రీ పరీక్షలకు 634 మంది గైర్హాజరు



వీఆర్ ఐఏఎస్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో గురువారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 634 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2014 మందికిగానూ 1380 మంది హాజరయ్యారు.

● వీఆర్ ఐఏఎస్ కళాశాల తనిఖీ

నెల్లూరులోని వీఆర్ ఐఏఎస్ కళాశాలలో గురువారం జరిగిన లా 9వ సెమిస్టర్ పరీక్షలను వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కల్పించిన మౌలిక వసతులు, అధ్యాపకుల పనితీరు, పరీక్షలు జరుగుతున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

● విద్యార్థి సంఘాల జేఏసీ ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

నెల్లూరు(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రైవేట్ విద్యాలయంలో విద్యార్థి మృతి చెందడంపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ బలవంతపు చదువులతో విద్యార్థుల మృతికి కారణమవుతు న్నారని ఆరోపించారు. ధనలక్ష్మీపురంలోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్యకు ఆ విద్యాసంస్థ యాజమాన్యమే కారణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే పాఠశాల లు, వసతి గృహాలపై, తరగతులపై తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్బీ, వైసీపీ స్టూడెంట్ విభాగం, ఎస్ఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంఘాల నేతలు షేక్ మస్తాన్ షరీఫ్, హర్ష, శేషు యాదవ్, సునీల్, కరిముల్లా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా : ఐదుగురికి గాయాలు

మర్రిపాడు, నవరంబరు 7 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తాపడి ఐదుగురికి గాయాలైన సంఘటన మర్రిపాడు మండలం చుంచులూరు వద్ద జాతీయ రహదారిపై గురు వారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పొంగూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో ఈగలు ఉండడంతో వాటిని బయటకి తరిమే క్రమంలో కారు అదుపు తప్పి ముళ్లపొదల్లోకి దూసుకువెళ్లి బోల్తాప డింది. దీంతో అందులో ఉన్న ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

హత్య కేసులో జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్),(ఆంధ్రజ్యోతి): తనకు తెలిసిన ఓ మహిళను అటపట్టించి కొట్టా డన్న ఆగ్రహంతో మహేంద్ర అనే వ్యక్తిని హత్య చేశాడన్న కేసులో నేరం రుజువు కావ డంతో చేవూరు సుధీర్ అనే నిందితుడికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధి స్తూ నెల్లూరు మూడవ అదనపు జిల్లా జడ్జి ఎల్ తేజోవతి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 జూలై 29వ తేదీన ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెం గ్రామంలో ఓ మహిళలను గేదెలను తోలుకు వెళతుండగా అదే గ్రామానికి చెందిన చిట్టిబోయిన మహేంద్ర అనే వ్యక్తి ఆమెతో పరాచకాలాడటంతో వారి మధ్య గొడవ జరిగింది. అక్కడికి సమీపంలో ఉన్న సుధీర్ అనే వ్యక్తి మహేంద్రను మందలించాడు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సుధీర్ ఆగ్రహానికిలోనై సాయంత్రం ఏడు గంటల సమయంలో మహేంద్రను కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. కత్తిపోటుకు రక్త గాయాలతో పడిపోయిన మహేం ద్రను గ్రామస్తులు నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుధీర్‌పై ఇందుకూరుపేట పోలీసులు కేసు నమోదే చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

టిడ్కో ఇళ్లలో అసాంఘిక చర్యల నియంత్రణ

● ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్

● అత్యాచార బాధితురాలికి పరామర్శ, సాయం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో నివాసాల వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి చర్య లు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ తెలిపారు. నెల్లూరులో వెంక టేశ్వరపురం పరిధిలోని టిడ్కో ఇళ్లలో అత్యాచారా నికి గురైన బాలికను గురువారం ఆయన పరామ ర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమ స్యలను అజయ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యాచార నిందిడిని అరెస్ట్ చేసినప్పటికీ దాన్ని ప్రేరేపించిన మహిళలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విష యంపై ఎస్పీతో మాట్లాడుతానన్నారు. టిడ్కో నివాసాల పరిశీలనకు తాను వస్తున్నా ఒక్క పోలీసు కూడా రాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడ్కో నివాసాల ప్రాంగణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. బాధిత బాలికకు జనసేన నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ రూ.పదివేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కిషోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7555
వెండి కిలో ధర	రూ. 96,100
వెండి ఒక గ్రాము	రూ.99.10

ఎన్ఎఫ్ఎస్ఎస్ యాప్‌పై అవగాహన

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం(ఎన్ఎఫ్ఎస్ఎస్) యాప్‌పై గురువారం నెల్లూరులోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో మండల వ్యవసాయా ధికారులు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఏవో పీ సత్యవాణి మాట్లాడుతూ పురుగులు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిం చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎఫ్ ఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలియజేశారు. వ్యవసాయ అధికారులు, ఆదర్శ రైతులు, కేవీకే శాస్త్రవేత్తలకు ప్రత్యే కంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారని, ఏ పంటకు ఏ తెగులు ఉధృతంగా సోకుతుందో గుర్తించి తగిన సలహాలు, సూచనలు రైతులకు అంద జేస్తారని చెప్పారు. పంటలకు పెద్ద ఎత్తున వైరస్ సోకినట్లుగా గుర్తిస్తే వెంటనే సంబంధిత రాష్ట్ర స్థాయిలో శాస్త్రవేత్తలను అప్రమత్తం చేసి అధ్యయ నం చేసి సామూహికంగా చేపట్టాల్సిన సస్యరక్షణచర్యలపై తగిన సూచనలు, సలహాలు ఇస్తారని వివరించారు. భవిష్య త్తులో తెగుళ్లు, వైరస్‌లను తట్టుకునే నూతన వంగడాల అభివృద్ధికి ఇది ఉపయోగపడు తుందని తెలిపారు.

సోమశిలకు 6వేల క్యూసెక్కుల వరద

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 6000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.250 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 10,000, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డెల్టాలో రబీ సాగు

● ముమ్మరంగా వ్యవసాయ పనులు ● సన్నాల రకాలవైపే రైతుల మొగ్గు

పొలంలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్





పెన్నా డెల్టా ఆయకట్టులో రబీ సీజను ప్రారంభమైంది. దీంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. నారుమళ్లను సిద్ధం చేసుకొంటూ, దుక్కులు దున్నుకుంటున్నారు. ఇప్పటికే సోమశిలలో 70టీఎంసీల వరకు సాగునీరు ఉండడంతో కండలేరు, కలిగిరి రిజర్వాయర్లకు సైతం నీరు సమృద్ధిగా రావడంతో రైతులు ధైర్యంగా ముందడుగు వేశారు. డెల్టా ఆయకట్టులో అత్య ధిక విస్తీర్ణంలో బీపీటీ రకాలు సాగు చేపడితే, మరింత విస్తీర్ణంలో షుగర్ లెస్ రైసుతోపాటు, కేఎల్ఎం, తెలంగాణ మసూరి రకాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

అల్లూరు, (ఆంధ్రజ్యోతి): పెన్నా డెల్టా ఆయకట్టులో రబీ సీజను ప్రారంభమైంది. దీంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. నారుమళ్లను సిద్ధం చేసుకొంటూ, దుక్కులు దున్నుకుంటున్నారు. పెన్నా డెల్టా ఆయకట్టులో డెల్టా, నాన్‌డెల్టాలను కలిపి సుమారు 8 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సీజన్‌లో వరిసాగు చేస్తారు. ఈ ఏడాది కూడా రబీ సాగుకు సంసిద్ధమయ్యారు. రెండో కారు పంట లేని కారణంగా రబీ సాగుపైనే రైతులు, రైతు కూలీలు ఆధారపడ్డారు. ఇప్పటికే సోమశిలలో 70 టీఎంసీల వరకు సాగునీరు ఉండడంతో కండలేరు, కలిగిరి రిజర్వాయర్లకు సైతం నీరు సమృద్ధిగా రావడంతో రైతులు ధైర్యంగా ముందడుగు వేశారు.

● సన్నాల రకాల సాగుకే మొగ్గు

జిల్లాలో వరిసాగు చేసే రైతులు అత్యధికంగా సన్నాల రకాలపైనే మొగ్గు చూపుతున్నారు. డెల్టా ఆయకట్టులో అత్యధిక విస్తీర్ణంలో బీపీటీ రకాలు సాగు చేపడితే, మరింత విస్తీర్ణంలో షుగర్‌లెస్ రైసుతోపాటు, కేఎల్ఎం, తెలంగాణ మసూరి రకాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. దీనికి కారణం తక్కువ పెట్టుబడి, అత్యధిక దిగుబడి, అధిక ధరలు. అన్ని రకాల సాగుకు ఇదే అదును కావడంతో రైతులు తమ అనుకూలతలను బట్టి పైరకాల వరి వంగడాలను సాగు చేస్తున్నారు.

ఐఏబీ లేకుండా నీటి విడుదల

ప్రతీఏటా ఐఏబీ సమావేశం నిర్వహిస్తారని, సాగునీటిని విడుదల చేస్తారని ఎదురు చూసేవాళ్లం. కానీ ఈ ఏడాది సమావేశం నిర్వహించకుండానే అధికారులు సాగునీటిని విడుదల చేశారు. దీంతో మేము సాగుపనుల్లో నిమగ్నమై ఉన్నాం. ఇప్పటికే సాగుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం.



- బాలకృష్ణ, రైతు, గోగులపల్లి, అల్లూరు మండలం

డెల్టాలో రబీ సీజనే ఆధారం

డెల్టాలో రబీ సీజనులో వరిసాగు ఒక్కటే ఆధారంగా జీవిస్తుంటాం. ఏడాదికో పంట మాత్రమే వేసుకుంటున్నాం. ఈ క్రమంలో గతేడాది రబీ సీజనులో వేసిన పంట మళ్లీ ఈ సీజనులో సాగుకు సమాయత్తమవుతున్నాం. పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో ఇతరత్రా పంటలు లేకుండా పోయాయి. కాబట్టి రబీ సీజన్ కోసం ఎదురు చూస్తుంటాం.



- ఎండేటి హరికృష్ణ, రైతు, ఇందుపూరు, అల్లూరు మండలం

14 నుంచి కేన్సర్ స్క్రీనింగ్

ఇంటి వద్దే వైద్య పరీక్షలు

అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14వ తేదీ నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీనిం గ్ పరీక్షలు నిర్వహిస్తా మని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య తెలియ చేశారు. గురువారం నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి కేన్సర్ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. దీనిని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ఈ ప్రదర్శన సాగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలను బాధి స్తున్న వ్యాధుల్లో 60 శాతం పైగా అసంక్రమిత వ్యాధులే నన్నారు. ఇందులో కేన్సర్ ఒకటని, దీన్ని మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. కేన్సర్ వ్యాధి బారినపడ కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ రమేష్, డాక్టర్ ప్రమోద్, డెమో కనకరత్నం పీఎంపీ సంఘం జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపా ల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

'జనరల్ నర్సింగ్'కు విద్యార్థుల ఎంపిక

● 23 నర్సింగ్ కళాశాలల హాజరు

నెల్లూరు (వైద్యం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నర్సింగ్ కళాశాలల్లో జనరల్ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగింది. 23 నర్సింగ్ కళాశాలల ప్రతినిదులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బీసీ వేల్ఫేర్ అధికారి హజరత్తయ్య, వైద్య ఆరోగ్య శాఖ నుంచి నాగరాజు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించి కోర్సుకు ఎంపిక చేశారు. మొత్తం 23 కళాశాలలకు సంబంధించి 500 సీట్లు ఉన్నాయి. కోర్సు కాలపరిమితి మూడేళ్లు.



విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

డిప్యుటేషన్లు ఎలా చేశారు?

● వైద్య ఆరోగ్య శాఖలో కొనసాగిన విచారణ ● డీఎంహెచ్‌వో, సిబ్బందిని ప్రశ్నించిన జేడీ



వైద్య శాఖ సిబ్బందిని ప్రశ్నిస్తున్న జేడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్

నెల్లూరు (వైద్యం), నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై వచ్చిన ఆరోపణల మీద ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ చేపట్టిన విచారణ గురువారం కూడా కొనసాగింది. వైద్య ఉద్యోగుల డిప్యుటేషన్లలో అక్రమాలపై ఉదయగిరి మండలానికి చెందిన జయ రాముడు అనే వ్యక్తి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఫిర్యాదు చేయటంతో ఈ విచారణ జరుగు తోంది. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యను విచారించారు. గతంలో చేపట్టిన వైద్యు ల డిప్యుటేషన్లలో నిబంధనలు పాటించారా?, డిప్యుటేషన్లు ఎలా చేపట్టారు అని డీఎంహెచ్‌వోను ప్రశ్నించారు. ఎఫ్ఆర్ఎస్ నిర్వహణ అధికారిగా డాక్టర్ ఉజ్వల చౌదరిని ఏ ప్రాతిపదికన నియమించారు?, కందుకూరు నియోజక వర్గంలోని పోకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రమోద్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎపిడమాలజిస్ట్‌గా ఎలా నియమించారని జేడీ ప్రశ్నించినట్లు తెలిసింది. మర్రిపాడు మండలం కృష్ణాపురం ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పీజీ కోర్సుకు వెళ్లాడంటూ దీనిపై కూడా ప్రశ్నించినట్లు సమాచారం. అనంతరం ఉద్యోగ సిబ్బందిని ప్రశ్నించారు. మొత్తం 21 మంది వైద్య ఉద్యోగుల డిప్యుటేషన్‌పై ప్రశ్నలు గుప్పించారు. వీరిలో 11 మంది హెల్త్ అసిస్టెంట్లను నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కార్యాలయంలోనే కేటాయింపులు జరపడంపై జేడీ ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో పాటు కరోనా నిధుల వినియోగంలో జరిగిన అవకతవకలపై కూడా విచారణ చేపట్టినట్లు సమాచారం. మొత్తం మీద జాయింట్ డైరెక్టర్ విచారణ వాడివేడిగా సాగిందని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

జనార్దనరెడ్డి కాలనీలో బాహాబాహీ

● మాజీ, ప్రస్తుత కార్పొరేటర్ వర్గాల కుమ్ములాట ● పలువురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు



గాయపడ్డ వ్యక్తులు

నెల్లూరు (క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు అడ్డగా ఉండే జనార్దనరెడ్డికాలనీలో ప్రస్తుత కార్పొరేటర్ భర్త వర్గం, మాజీ కార్పొరేటర్ భర్త వర్గాల మధ్య చెలరేగిన వివాదం చిలికి..చిలికి దాడులకు దారితీసింది. సేకరించిన వివరాలు, పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని 54వ డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త జహీర్ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు జనార్దనరెడ్డికాలనీ దర్గావీధిలోని గుంత స్థలాన్ని చదును చేసే ప్రయత్నంలో భాగంగా గురువారం ట్రాక్టర్లతో మట్టి తోలుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రస్తుత కార్పొరేటర్, ఆమె భర్త ముజీర్ వర్గం అక్కడి చేరుకొని ట్రాక్టర్లను అడ్డుకుంది. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. అది తారాస్థాయికి చేరుకోవడంతో కర్రలు, రాడ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలకు చెందిన పలువురికి తీవ్రగాయాలయ్యా యి. ముజీర్ వర్గానికి చెందిన వారు ప్రభుత్వ వైద్యశాలలో, జహీర్ వర్గం అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. రెండు వర్గాల వారిని టీడీపీ నాయకులు పరామర్శించారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు నవాబుపేట సీఐ అన్వర్‌బాషా తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రంగనాయకులపేట రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రైలు కింద పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొం డయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై నారింజ రంగు బనియన్, బ్లూ కలర్ షార్ట్ ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

ఆచార్య ఎన్జీ రంగాకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కావలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు గురువారం ఏడీఏ కార్యాలయంలో ఆచార్య రంగా జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఎన్జీ రంగా చిత్రపటానికి కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, దుర్గాప్రసాద్, సునీత, శోభ, మాధవి, క్రాంతి పాల్గొన్నారు.

నేటినుంచి సీపీఎం ప్రజాపోరు

కావలి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రజాపోరు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య తెలిపారు. గురువారం సీపీఎం కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను నేతలు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, బాబురావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కావలి రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెంలో గురువారం పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సమద్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మంత్రి, ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సూచనల మేరకు నెల్లూరు నారాయణ వైద్యశాల బృందంతో ఏర్పాటు చేసిన శిబిరంలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమం టీడీపీ నేతలు నాయకులు పులి రమేష్, సుధాకర్, రమణయ్య పాల్గొన్నారు.

ట్రాక్టరు ఢీకొని ఒకరికి గాయాలు

కలిగిరి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కలిగిరి-కొండాపురం మార్గంలోని కలిగిరి శివారులో గురువారం రాత్రి ట్రాక్టరును ఢీకొని వ్యక్తి గాయపడ్డాడు. కలిగిరికి చెందిన ట్రాక్టరు కట్టెల లోడుతో క్రిష్ణారెడ్డిపాలెం వైపు వెళ్తుండగా వింజమూరు మండలం నేరేడుపల్లి కండె మనోహర్ కొండాపురం వైపు నుండి వస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టరులోని చిల్లకట్టె మనోహర్ మెడలో బలంగా గుచ్చుకొంది. గాయపడిన అతన్ని ప్రయాణికులు గుర్తించి స్థానిక ప్రవేటు వైద్యశాలలో ప్రథమి చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి నెల్లూరుకు తరలించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కలువాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. గురువారం టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సభ్యత్వాలు నమోదు చేశారు. వారి వెంట పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిద్రమత్తులో ట్రాన్స్‌కో సిబ్బంది

● మండలంలో వందకు పైగా పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు
● మరమ్మతులకు నోచుకోని వైనం

జలదంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయసీజన్ మొదలై రైతులు వరి నార్లు పోసేందుకు సిద్ధం అవుతున్న సమయంలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లు నెలల తరబడి రిపేర్లు చేయక వ్యవసాయబోర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతులు ట్రాన్స్‌కో లైన్‌మెన్లు చుట్టూరా కాళ్లరిగేలా తిరుగుతున్నా సమస్యను పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు వందకు పైగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు ఇటీవల కురిసిన వర్షాలకు పిడుగులు పడి మరమ్మతులకు గురైనట్లు రైతులు వాపోతున్నారు. గట్టుపల్లి పంచాయతీకి లైన్‌మెన్ లేక అక్కడి రైతులు తమ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయించండని కావలి ట్రాన్స్‌కో డీఈని కలిసేందుకు రాగా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగిపోయారు. విద్యుత్ సరఫరా లేక రైతులు వరినారుమళ్ళు పోసుకోలేకపోతున్నారు. కేవలం వ్యవసాయం పైనే ఆధారపడిన మా సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


బ్రాహ్మణక్రాకలోని ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌కో ఎస్ఈ స్పందించాలి

మండలంలో ట్రాన్స్‌కో వ్యవస్థను గాడిలో పెట్టేలా ఎస్ఈ స్పందించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా విద్యుత్ సమస్యలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలో పలుచోట్ల లైన్‌మెన్లు లేక సిబ్బంది కొరతతో ఉన్న సిబ్బందిపై భారం పడుతోంది. ఈ సిబ్బంది కొరతను తీర్చి మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లు యుద్ధప్రాతిపదికన రిపేరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కేన్సర్‌పై వైద్యుల అవగాహన ర్యాలీ

ఏఎస్ పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సురేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పీహెచ్‌సీ నుండి బస్టాండ్ సెంటర్ వరకు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలు, మద్యం, సిగరెట్, పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుండి రక్షణ పొందవచ్చన్నారు. ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● కలిగిరి,(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌వ్యాధి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రా థమిక ఆరోగ్యవైద్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి మాటా్లడారు. 30ఏళ్లు నిండిన వారు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎన్‌సీడీ 3.0సర్వేతో ప్రతి కుటుంబంలోని సభ్యులందరికీ ఈ స్ర్కీనింగ్ పరీక్షలు గురించి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిలక్ష్మీ పాల్గొన్నారు.


కలిగిరి : ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

● ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): గండిపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యఆరోగ్య సిబ్బంది వైద్యాధికారి శివకల్పన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి సచివాలయం పరిధి లో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, టీబీ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి : ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

● సీతారామపురం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో కేన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఓ మజీద్, రియాజ్, శేఖర్‌రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

15రోజుల్లో ఎఫ్ లైన్ సర్వే

● కోటేశ్వరరావు, కొండాపురం తహసీల్దార్



కొండాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేలో రైతులకు పాసుపుస్తకాల విషయంలో తప్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు కోటేశ్వర రావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 15రోజులకు ఎఫ్‌లైన్ సర్వేతో తప్పులు సరి చేస్తామన్నారు.

ఈ ప్రశ్నలు

? కౌలురైతులకు ఎన్ని కార్డులు ఇచ్చారు.

! ఇప్పటివరకు 1600 మందికి అందజేశాం. అర్హులు దరఖాస్తు చేసుకుంటే వారంలో అందజేస్తాం.

? గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీదారుడికి పరిష్కారం దొరుకుతుందా!

! దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆధారాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం పరిష్కారిస్తాం.

? రిజిష్టరు డాక్యుమెంటు రైతులు మ్యుటేషన్ ఎలా చేయాలి.

! ఆన్‌లైన్‌లో పేర్లు మార్పునకు దరఖాస్తు చేసుకుంటే 45రోజుల్లో పేర్లు మార్చి ఈ-పాస్‌బుక్కును అందజేస్తాం.

ఇస్కపాలెంలో రక్తదాన శిబిరం


శిబిరంలో పాల్గొన్న దామా శివబాబు తదితరులు

కొండాపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం టీడీపీ నేత దామా మస్తానయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు దామా శివబాబు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకర్ల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీనర సింహులు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, గుడవళ్లూరు సొసైటీ మాజీ చైర్మన్ కుంకు మోహనరావు, సాగునీటిసంఘ మాజీ అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, బొల్లినేని వెంకటరమణయ్య, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, తాటికొండ ప్రవీణ్, కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోగా జానకీరామ్

కందుకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ డీఈఓగా జానకీరామ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధసంఘాల నాయకులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు ముప్పరాజు కోటేశ్వర రావు, దామా కొండపనాయుడు, చిత్తారు వెంకటేశ్వర్లు, పొన్నగంటి వెంకటేశ్వర్లు, రవి, పవన్, రమేష్, విప్ర నారాయణ ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కందుకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్ బాల్ మహిళలు, పురుషుల జట్లను ఎంపిక చేశారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, టీఆర్ఆర్ పీడీ తొట్టెంపూడి సుబ్బారావు ఆధ్వర్యంలో నైపుణ్యం ప్రదర్శించిన 16 మందిని పురుషుల జట్టుకు, 14 మందిని మహిళల జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, పీడీలు సోమినేని సురేష్, సయ్యద్ జిలానీబాషా పాల్గొన్నారు.

కరేడు విద్యార్థుల ప్రతిభ

ఉలవపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాల్‌బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీల్లో కరేడు విద్యార్థులు దొడ్ల యోషితారెడ్డి, కంభోతు గాయత్రి, కసుకుర్తి నిహల్, గడ్డె హృదయ సందేష్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరిని స్కూల్ కమిటీ చైర్మన్ బాలేశ్వ రరావు, కాటబత్తిన కృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందజేత

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బలిజపాలెం దారా కల్యాణి ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు అయ్యాయి. అందుకు సంబంధించిన ఎల్‌ఓసీని గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు బాధితులకు అందజేశారు. ఆమె కుటుంబీకులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఆపరేషన్ ఖర్చులకు అవసరమయ్యే ఖర్చును సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించినట్లు పార్టీ నేతలు తెలిపారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కావలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలు పంచారామాలు, శ్రీశైలం, అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కావలి ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమస్యలపై ప్రజాప్రతినిధుల ఏకరువు


మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

గుడ్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతూ, పొలాల్లోని మోటార్ పంపుసెట్లు కాలిపోతున్నట్లు అలాగే రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పని చేయడం లేదని సాలిపేట, పరకొండపాడు గ్రామాల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు పలు అంశాలను లేవనెత్తారు. ప్రధానంగా చేవూరుకు విద్యుత్ సమస్య ఉందని చేవూరు సర్పంచ్ శెట్టిపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే కర్లపాలెంలో ఇబ్బందిగా ఉన్న రెండు ప్రదేశాల్లో నాలుగు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అనేకసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని సర్పంచ్ చాపల రమణయ్య వాపోయారు. గుడ్లూరు మండలంలో విస్తరిస్తున్న విష జ్వరాలను అదుపుచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఏవో రవికుమార్, ఏపీవో అబ్దుల్, పశుసంవర్ధక ప్రతినిధి గోవర్ధన్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సాగర్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు చెన్నారెడ్డి వరమ్మ, కార్యదర్శులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండల కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, ఏవో శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు ఉద్దాల పెంచలరావు, కంభంశెట్టి ప్రమీల, ఎంపీటీసీ సభ్యులుపాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

అయ్యప్ప భక్తులకు బిక్ష ఏర్పాటు

సంగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప మాల ధరించిన భక్తులకు ప్రతిరోజు మధ్యాహ్నం పోలయ్యస్వామి ఆధ్వర్యంలో దాతల సహకారంతో భిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం సీసాల పట్టివేత

సీతారామపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోలంగారిపల్లిలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించి 19మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ టీ లక్ష్మణస్వామి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిబ్బందితో కలిసి పోలం గారి పల్లిలో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి రమణయ్య వద్ద 9, వెంకటసుబ్బయ్య వద్ద 10సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మర్రిపాడులో పశువైద్య శిబిరం

సంగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు పశువైద్యశాలలో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ డి సుజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పశువైద్య శిబిరంలో లేగదూడల అందాల పోటీలు నిర్వహిచనున్నట్లు పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వర్గీకరణపై కుట్రలు దారుణం : ఎంఎస్‌పీ


జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

వరికుంటపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పోరాటాలు సాగించి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని కుట్రలు పన్నడం దారుణమని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ అన్నారు. గురువారం గణేశ్వరాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఎమ్మార్పీస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12న మంద కృష్ణమాదిగ నెల్లూరు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని వర్గీకరణకు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామ కమిటీల ఎంపిక జరిగింది. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి తాతిపూడి డేవిడ్‌మాదిగ, నాయ కులు బకీరుజాషువా మాదిగ, బెజవాడ బాలగురవ య్య మాదిగ, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

ఉదయగిరి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది, మినుము, పెసర, మొక్కజొన్న పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ సూచించారు. గురువారం అప్పసముద్రం రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పంట సాగు చేయాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి సలహాలు అందజేశారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

అనంతసాగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొమ్మవరంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. గురువారం సిబ్బందిచే ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసి బాధ్యులకు నోటీసులు అందజేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చేజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఆత్మకూరు ఎమ్‌విఐ రాములు సూచించారు. గురువారం చేజర్ల మండలంలోని బోడిపాడు గ్రామ సమీపంలో ఉన్న లుంబిని విద్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లుంబిని విద్యాలయం కరస్పాండెంట్ రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యక్ష నగదు బదిలీ సేవలు వేగవంతం

ఉదయగిరి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ తపాలా కార్యాలయాల ద్వారా ఖాతాదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ సేవలను వేగవంతం చేయనున్నట్లు ఉదయగిరి సబ్ డివిజన్ పోస్టల్ ఇనస్పెక్టర్ వేగూరు సాయికృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధార్‌కార్డు నెంబర్లకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింకును అనుసంధానం చేయడంతోపాటు లావాదేవీలు నిర్వహించక ఆగిపోయిన లింకులను పునరుద్ధరిస్తామన్నారు. కావున ఖాతాదారులు ఈనెల 14వ తేదీలోపు సమీప పోస్టాఫీసులకు వెళ్లి ఎన్‌పీసీఐ లింకును అనుసంధానం చేయించుకోవాలన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

సీతారామపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య గణన-2024 సర్వేకి సంబంధించి ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఈఓపీఆర్డీ భార్గవి పాల్గొన్నారు.

● వరికుంటపాడు, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప రిషత్ కార్యాలయంలో శుక్రవారం నైపుణ్య గణన సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందిన ఆరుగురి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10వేల వంతున రూ. 60వేలు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి గురువారం అందజేశారు. 1వ వార్డులోని గడ్డం రమేష్ , 4వ వార్డులో తంగేళ్ల రామోహన్‌రాజు, 9వ వార్డులోని ఇంటూరు శ్రీనివాసులు, 14వ వార్డులో ఒంటేరు వెంకటసుబ్బయ్య, పఠాన్ దిల్షాద్, 19వ వార్డులో షేక్ సాధిక్ కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

నష్టపరిహారం పెంచి రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నడికుడి-కాళహస్తి రైల్వే లైను నిర్మాణ పనులకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం పెంచాలని అప్పారావుపాళెం రైతులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. ఈసందర్భంగా అప్పారావుపాళెం రైతులు మాట్లాడుతూ మాగాణి భూములను మెట్ట భూములుగా రికార్డుల్లో చూపించినందున సరైన నష్టపరిహారం అందక తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరికీ మేలు చేకూరే నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఇళ్లు కట్టకుండానే నగదు స్వాహా చేశారు

● ఎంపీడీవోకు లబ్ధిదారుల మొర


ఎంపీడీవో ఎదుట వాపోతున్న లబ్ధిదారులు

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో పక్కాగృహాలు నిర్మించకుండానే కాంట్రాక్టర్ నగదు స్వాహా చేశాడని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు గురువారం ఇన్ చార్జి ఎంపీడీవో అప్పాజీ ఎదుట వాపోయారు. కాంట్రాక్టర్ కొంతమందికి బేస్ మట్టాల వరకు ఇళ్లు నిర్మించగా, మరికొంతమందికి ఇళ్లు నిర్మించకుండానే రూ.70 వేలు స్వాహా చేశాడన్నారు. స్పందించిన ఎంపీడీవో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

కబ్జా నిజమైతే స్వాధీనం చేసుకోండి

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి టౌన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఅవుట్లు వేసి అమ్మినట్లు నిజమైతే వాటిని స్వాధీనపరుచుకోవాల తప్ప ఇలా తనపై దుష్ప్రచారం తగదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి వాపోయారు. ఈ విషయంపై గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వెళ్లి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. తనపై చేసే తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు.

తిరుమలాపురంలో గ్రామసభ

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో గురువారం భూసర్వేపై తహసీల్దారు సుభద్ర గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో నిర్వహించిన భూ సర్వేలో నెలకొన్న సమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

వెంకటాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం జాతీయ కేన్సర్ అవగాహన దినం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కీర్తిప్రియ, డాక్టర్ ప్రణవి, సీహెచ్‌వో రామసుబ్బారెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు, వరిగొండ పీహెచ్‌సీ కేంద్రాల పరిధిలో గురువారం డాక్టర్ నరేంద్ర, డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఉమర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : స్క్రీనింగ్‌తోనే కేన్సర్ నివారణ సాధ్యమని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు అన్నారు. జొన్నవాడ, దామమడుగులో గురువారం జాతీయ కేన్సర్ అవగాహన దినం నిర్వహించారు. జొన్నవాడ, దామరమడుగులో ర్యాలీలు చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్లు అహ్మద్‌బాబు, వినయ్‌కుమార్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దామరమడుగులో వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీ

జొన్నవాడ ఆలయానికి వాటర్ కూలర్ బహూకరణ

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయానికి బుధవారం ఎస్‌బీఐ తిరుపతి అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్(డీజీఎం)జీ లేఖామీనన్ మినరల్ వాటర్ కూలర్‌ను బహూకరించారు. ముందుగా దాతల గోత్రనామాలతో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రాలతో సత్కరించారు. ఆమె వెంట ఎస్‌బీఐ ఆర్‌ఎం ఎన్. శ్రీనివాసరావు, ముఖ్య కార్యదర్శి ఆర్. శేషగిరి, బ్యాంకు సిబ్బంది, ఆలయ ఉద్యోగులు మురళి, కుష్వంత్ తదితరులు ఉన్నారు.



కూలర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం లేఖామీనన్, తదితరులు

విద్యార్థులకు దంత వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ నలంద పాఠశాలలో గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్‌డెంటల్ కేర్ డాక్టర్ రాజేశ్వరి విద్యార్థులకు, తల్లిదండ్రులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందచేశారు. దంతాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ కేవీఎస్ కిరణ్‌కుమార్, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ శ్వాంతన్, స్థానిక నేతలు అంచూరి జానకి, శ్రీనివాసులు నాయుడు, పాఠశాల సిబ్బంది మురళీ మోహన్‌రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

'నారాయణ'లో రోడ్డు భద్రతపై అవగాహన

నెల్లూరు(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రవాణాశాఖ ఎంవీఐ రఫీ పాల్గొని రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ, నిబంధనలతోపాటు ఆన్‌లైన్‌లో ఎల్ఎల్ఆర్‌ను ఎలా దరఖాస్తు చేసుకోవాలో విద్యార్థులకు తెలియచేశారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆయనను సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీఎస్ శ్రీధర్, అధ్యాపకులు డాక్టర్ వీ సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం చంద్రమోహన్‌రెడ్డి, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, మల్లికార్జునరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఎంవీఐను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు

'వాత్సల్య' విద్యార్థిని భార్గవి



రాష్ట్రస్థాయిలో కప్పు సాధించిన భార్గవిని అభినందిస్తున్న జీవీ సాంబశివరావు, ప్రిన్సిపాల్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జనహిత-వాత్సల్య శరణాలయం, జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న బీ భార్గవి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. అక్టోబరులో అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఆమె ద్వితీయ స్థానం సాధించింది. తద్వారా జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ క్రమంలో భార్గవిని జనహిత-వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు గురువారం వాత్సల్య కార్యాలయంలో నగదు బహుమతి అందచేసి అభినందించారు. కార్యక్రమం లో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ రవికుమార్, ఎస్ఎస్ఎస్ పీవో దోర్నాదుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీల్లేక గందరగోళం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయం, నవాబుపేట శివాలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథ ఆలయాల్లో కార్తీక మాసోత్సవాలకు ఉత్సవ కమిటీలను అధికారికంగా ప్రకటించలేదు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన జనసేన పార్టీ మూడు ఆలయాలకు 6 మంది (ఇద్దరు) చొప్పున అభ్యర్థులను ఖరారు చేసింది. ఆమేరకు ప్రకటన కూడా టిడ్కో అధ్యక్షుడు, నెల్లూరుజిల్లా పర్యవేక్షకుడు వీ అజయ్‌కుమార్ పేరున జారీ అయింది. టీడీపీ, బీజేపీలు అభ్యర్థుల పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం లేదు. ఈ మాసోత్సవాలకు ఉత్సవ కమిటీలు ఉన్నాయా.. లేదా అనేది దేవదాయ శాఖ అధికారులకు కూడా ఇంతవరకు సమాచారం లేదు. దీంతో ఆయా ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణపై గందరగోళం నెలకొంది.

10న విజయమహల్ సెంటర్ కథా సంపుటి ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోహిణీ వంజారి రచించిన విజయమహల్ సెంటర్ కథా సంపుటి ఆవిష్కరణ ఈనెల 10వతేదీ ఉదయం 10గంటలకు జరుగుతుందని నిర్వాహక కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమం టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో జరుగుతుందని తెలిపింది. సాహితీవేత్తలు, అభిలాషులు, పుస్తక ప్రియులు తరలిరావాలని కోరారు.

రెవెన్యూలో మార్పులు

● ఆరుగురు ఆర్ఐలు వచ్చే అవకాశం ● మరో ఇద్దరు ఆర్వోలు కూడా
● ప్రస్తుతమున్న వారిలో ఒకరిద్దరికి ఉద్వాసన ● సూపరింటెండెంట్ల బదిలీలకు సిద్ధం

నెల్లూరు(సిటీ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగంలో భారీగా మార్పులు జరుగుతున్నాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా కొత్తగా ఆరుగురిని తీసుకునేందుకు రాజకీయ వర్గాల నుంచి స్పష్టమైన సూచనలు కార్పొరేషన్‌కు అందగా, మరో ఇద్దరు ఆర్వోలను కూడా నియమించేందుకు దాదాపుగా కసరత్తు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆర్ఐలుగా కొనసాగుతున్న వారిలో ఒకరిద్దరికి ఉద్వాసన పలికే అవకాశం ఉందని సమాచారం. ఇవికాక కార్పొరేషన్‌లోని పలు విభాగాల సూపరింటెండెంట్లను కూడా బదిలీ చేసేందుకు కమిషనర్ సూర్యతేజ సిద్ధమైనట్లు తెలిసింది.

కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగం అత్యంత కీలకమైంది. ఆర్థిక పరమైన లావాదేవీలన్నీ ఆ విభాగం పరిధిలోకే వస్తాయి. నగరంలోని 54 డివిజన్ల నుంచి ఏటా సుమారుగా రూ. 80 కోట్ల వరకు ఆస్తి పన్ను వసూలు చేస్తుంటారు. కొత్త నిర్మాణాలకు ఆస్తి పన్ను విధించాల్సిన బాధ్యత కూడా రెవెన్యూదే. ఆ విభాగంలో ప్రస్తుతం ముగ్గురు ఆర్వోలు పని చేస్తుండగా క్షేత్ర స్థాయిలో 10 మంది ఆర్ఐలు పన్ను వసూళ్లను పర్యవేక్షిస్తున్నారు. వీరందరిలోకి ఒకరిద్దరు కొత్తవారు కాగా మిగిలిన వారంతా ఏళ్ల తరబడి కొనసాగుతున్నవారే. ఈ ఆర్ఐలలో ఒకరిద్దరికి ఉద్వాసన పలికి కార్పొరేషన్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా నియమించనున్నట్లు తెలిసింది. ఇక ప్రస్తుతమున్న ముగ్గురు ఆర్వోలలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఓ మహిళా అధికారిని ఆ బాధ్యతల నుంచి తప్పిస్తారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.



● కొత్త ఆర్ఐలంతా అడ్మిన్లే

రెవెన్యూ విభాగంలోకి కొత్త ఆర్ఐలుగా ప్రవేశిస్తున్న వారంత సచివాల యాల్లోని అడ్మిన్లు కావడం విశేషం. సిటీ నియోజకవర్గం నుంచి ముగ్గురు, రూరల్ నుంచి మరో ముగ్గురిని ఆర్ఐలుగా తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నూతన నియామకాలు రెవెన్యూ విభాగంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పేస్కేల్ ప్రకారం సచివాలయాల అడ్మిన్లు రికార్డు అసిస్టెంట్ హోదాలో ఉంటారని, వారికి సీనియర్ సహాయకుల కిచ్చే ఆర్ఐ ర్యాంకు ఎలా ఇస్తారనే చర్చ కార్పొరేషన్‌లో జరుగుతోంది. ఇప్పటికే బిల్‌కలెక్టర్లు కొందరు సచివాలయాలకు అడ్మిన్లుగా ఉన్నారని, అలాంటి వారికి రెండు ప్రమోషన్ల తర్వాత వచ్చే ఆర్ఐ హోదాను ఇప్పుడే ఎలా ఇస్తారంటూ ఉన్నతాధికారులకు అభ్యంతరాలు వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది.

● విభాగాల్లోనూ స్థాన చలనం

నగర పాలికలోని పలు విభాగాల్లో ఏళ్ల తరబడి కొందరు అధికారులు పర్యవేక్షకుల హోదాలో కుర్చీలకు అతుక్కుపోయారు. అలాంటి వారి వివరాలు సేకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ, సదరు సూపరింటెండెంట్లకు కూడా త్వరలో స్థానచలనం కల్పించనున్నారని తెలిసింది. ఇప్పటికే సిటీ ప్లానింగ్, రెవెన్యూ, ఆరోగ్యం, ఇంజనీరింగ్ విభాగాలపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొందరు ఉద్యోగులు అధికార పార్టీ నాయకులను ఆశ్రయించడంతో వారి బదిలీ జరుగుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

వైసీపీ ఆపేసిన పథకాలను పునఃప్రారంభిస్తాం : సోమిరెడ్డి

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఆపేసిన అన్నీ పథకాలను పునఃప్రారంభిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం నిమ్మ మార్కెట్‌యార్డులో నిమ్మ, బొప్పాయి, మిరప పంటల సస్యరక్షణపై జరిగిన రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. వ్యవసాయశాఖను మూతేసిన కాకాణికి రైతుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతు సంక్షేమ పథకాలను నిలిపేసిందన్నారు. ఇప్పుడు రైతులకు మళ్లీ రోజులొచ్చాయని, అన్నీ పథకాలు ఒక్కొక్కటిగా అందబోతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, కట్టర్లను ఆయన పంపిణీ చేశారు కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, తిరుపతి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏడీఏ శివనాయక్, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జున్ నాయుడు, పెంచలభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బక్కయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పనులు చేస్తుంటే కాకాణికి బాధెందుకో ?

రైతుల భాగస్వామ్యంతో కాలువ పనులు జరుగుతుంటే కాకాణికి బాధెందుకని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం మండలంలోని సంగం ఆనకట్ట వద్ద నుంచి కనుపూరు కాలువకు, ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ కాకాణి మొన్న కనుపూరు కాలువ వద్ద డ్రామాకు తెరలేపి చివరకు తోక ముడిచారన్నారు. రైతులు చేసుకుంటున్న పనులకు టెండర్ల పేరుతో వేషాలేస్తే తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. శుక్రవారం ఐఏబీ సమావేశం జరగబోతున్నదని చుక్కనీరు వృథా కాకుండా కాపాడడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ నాగరాజు, డీఈలు శంకర్‌నారాయణ, పెంచలయ్య. నాయకులు పీ సురేష్‌రెడ్డి, అనీల్‌కుమార్, వై అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు స్ప్రేయర్లు అందిస్తున్న సోమిరెడ్డి

చెల్లాయపాళెంలో గ్రామసభ

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాయపాళెంలో గురువారం రీసర్వేపై తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పలువురు రీసర్వే, పింఛన్ల సమస్యలపై 14అర్జీలు ఇచ్చారని తహసీల్దారు తెలిపారు.

ఎక్సైజ్ స్టేషన్ ఎదుట నిరసన

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎక్సైజ్ సీఐ తమ మద్యం షాపునకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మద్యం షాపు లైసెన్స్ హోల్డర్ కడియాల లక్ష్మీ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎక్సైజ్ కార్యాల యం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆమె నిరసన వ్యక్తం చేశారు. చేస్తూ అనంతరం మాట్లాడుతూ తమకు మండలంలో లక్కీడ్రాలో 154 షాపు వచ్చిందని, మండలంలో తాము ఎక్కడైనా మద్యం దుకాణం నిర్వహించే హక్కు ఉందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

కనుపూరు కాలువ పరిశీలన

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం మండలంలోని కనుపూరు కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌కు ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతి సందర్భంగా స్థానిక ఆర్ఎస్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సైన్స్ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ చంద్రశేఖర్ వెంకటరామన్ నోబుల్ బహుమతి పొందిన భారతదేశ భౌతిక శాస్త్రవేత్త అని, ఆయన రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టారని చెప్పారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో సైన్స్ ఉపాధ్యాయుడు మల్లికార్జున, ఎన్‌సీసీ ఆఫీసర్ బాలబ్రహ్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐపీపీబీ ఖాతామేళా

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తపాలాశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఐపీపీబీ ఖాతా మేళాను శుక్రవారం నుంచి 14వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి సచివాలయం వద్ద తపాలా శాఖ సిబ్బంది సేవలు అందిస్తారని తెలిపారు. భారత తపాలా శాఖ సేవలు, పొదుపు ఖాతాలు, పోస్టల్ బ్యాంకు ఖాతా లావాదేవీలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు.

త్వరలో మ్యూజియం ఆధునికీకరణ

● నగర కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగర వాసులు, విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు మ్యూజియంను త్వరలో ఆధునికీకరించనున్నట్లు కమిషనర్ సూర్యతేజ తెలిపారు. గురువారం టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో కలిసి మాగుంటలేఅవుట్‌లో ఉన్న మ్యూజియంను సందర్శించారు. ఇరువురు మాట్లాడుతూ మ్యూజియంలో లైటింగ్, రంగులు, మరింత పురాతన వస్తువుల ఏర్పాటుపై దృష్టిపెట్టామన్నారు. అనంతరం కమిషనర్ ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. అప్పటికే మురుగునీరుతో నడిచేవారికి ఇక్కట్లుగా ఉండటంతో ఇంజన్లు, వాహనాలతో నీటిని బయటకు తోడేయించారు. వర్షాలు పడుతున్నందున నగర వ్యాప్తంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు.

రుణాల పై అవగాహన కల్పించండి : ఏడీసీ

నగరంలోని పొదుపు గ్రూపు సభ్యులకు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై అవగాహన కల్పించాలని ఏడీసీ నందన్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలు, మెప్మా సిబ్బందికి గురువారం ప్ర త్యేక సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక బృందాల వారు కేంద్రం ప్రవేశపెట్టిన యాప్‌ను వారి ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, టీపీఆర్వో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మ్యూజియంలో పత్రాలు పరిశీలిస్తున్న కమిషనర్

గ్రామాల్లో మెరుగైన ఉపాధికి నైపుణ్య గణన

నెల్లూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులను గుర్తించి సర్వేలో లెక్కించాలని నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని అధికారులతో గురువారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులకు నైపుణ్య గణనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాధికారులు పల్లెల్లో ప్రతీ ఇంటికి వెళ్లి అక్కడున్న విద్యావంతులను గుర్తించాలన్నారు. వారు ఏ రంగంలో నైపుణ్యం కలిగి ఉన్నారో తెలుసుకుని నమోదు చేయాలన్నారు. లోపాలు లేకుండా చేపట్టాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

'మెడికవర్'లో అన్ని రకాల కేన్సర్లకు చికిత్స

నెల్లూరు (వైద్యం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అన్ని రకాల కేన్సర్ వ్యాధులకు వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాంక్రియాసిస్, లివర్ సర్జరీలు విజయవంతంగా చేశామన్నారు. ప్రతి మంగళవారం ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలియ చేశారు. సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ రొమ్ము కేన్సర్‌లో రొమ్ము తొలగించాల్సిన స్థితిలో ప్లాస్టిక్ సర్జరీ ద్వారా బ్రెస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేన్సర్ విభాగం హెడ్ డాక్టర్ బిందురెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యస్వంత్‌రెడ్డి, డాక్టర్ హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

నేడు కోటి సోమవారం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో విశిష్టమైన పండుగల్లో కోటి సోమవారం ఒకటి. దీనిని జిల్లావ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. కార్తీక మాసంలో శ్రవణ నక్షత్రం వచ్చిన రోజును కోటి సోమవారంగా పరిగణిస్తారు. ఈ పండుగకు జిల్లాలోని శైవక్షేత్రాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. కోటి సోమవారం రోజు.. స్నానం, దానం, ఉపవాసం చేసిన వారికి కోటి రెట్లు పుణ్యఫలం లభిస్తుందని మన పురాణా లు తెలియజేస్తున్నాయి.

వరినాట్లకు సిద్ధం

● వ్యవసాయాధికారిణి ఇందిరావతి



కోవూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నీటి వనరులు నిండడంతో రైతులు వరినాట్లకు సిద్ధమవుతున్నారని కోవూరు వ్యవసాయాధికారిణి ఇందిరావతి తెలిపారు. రైతులు ఏయే రకాలు సాగు చేయాల్లో గ్రామాల్లో తిరిగి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

? కోవూరు ప్రాంతంలో ఏయే రకాల వరిపైర్లు సాగు చేస్తారు.

! బీపీటీ 5264. దీన్ని జిలకర మసూర అంటారు. 60శాతం పొలాల్లో దీన్ని పండించేందుకు సిద్ధమవుతున్నారు. మిగతా నలభైశాతం పొలాల్లో కేఎస్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 రకాలు పండించేందుకు నార్లు పోశారు.

? వరి నాట్లు ఎప్పటి నుంచి వేస్తారు.

! ఈ నెల 15 తరువాత వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. నెలాఖరుకు నాట్లు ముమ్మరమవుతాయి. బీపీటీ 526 4 ఐదు నెలల పంట. కేఎస్ఎం 1638, ఆర్ ఎన్ఆర్ 15048 రకాలు నాలుగు నెలల పంట.

? ఏయే రసాయనిక ఎరువులు వాడాలి.

! నత్రజని, ఫాస్పేట్ వాడాలి. నారు మళ్లల్లో కార్బోఫిరాన్ గుళికలు వాడితే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. నారు పీకే ముందు వారం రోజులకు ఒకసారి వాడితే సత్ఫలితాలు వస్తాయి. ఆకుముడత, మోమిపిప్పి, బుల్లికోడులను నివారించవచ్చు. అగ్గితెగులు సోకనప్పటికీ రైతులు పురుగు మందులు ఎక్కువగా వాడుతున్నారు. వాడాల్సిన అవసరం లేదు.

న్యూస్ బాక్స్

వీపీఆర్ దంపతుల పరామర్శ



అశోక్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న వీపీఆర్ దంపతులు

కోవూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లోని ప్రముఖ పారిశ్రామికవేత్త అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం పరామర్శించారు. అశోక్‌రెడ్డి సతీమణి సులోచనమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో వారు అశోక్‌రెడిని ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి వెంట టీడీపీ నాయకులు గాదిరాజు అశోక్‌కుమార్, జెట్టి రాజగోపాలరెడ్డి, బాలరవి, పిచ్చుక మధుసూదనరావు, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్గానిక్ సాగుపై అవగాహన

వెంకటాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లిలో గురువారం స్వరూప్ అగ్రో కెమికల్ ఇండస్ట్రీస్, నాసిక్ మహారాష్ట్ర సంస్థల ఆధ్వర్యంలో ఆర్గానిక్ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. స్వరూప్ అగ్రో కెమికల్ హెడ్ రఘుకుమార్ మాట్లాడుతూ రైతులు ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి ఎంతో ఉత్సాహం చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి హరి కరుణాకర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

వెంకటాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట సమీపంలోని శ్రీడ్స్ కల్యాణ మండపంలో శుక్రవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గిరిజనుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కల్పన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులంతా పాల్గొనే ఈ కార్యక్రమాన్ని గిరిజనులు తప్పక వినియోగించుకోవాలని తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసులు



బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు

మనుబోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య పదిరోజులు సెలవుపై వెళ్లారు. దీంతో వెంకటాచలం తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. రీసర్వే డీటీ మంజుల, ఇతర సిబ్బందిని ఆయన పరిచయం చేసుకున్నారు.



ఆంధ్రజ్యోతి విజిట్

బడులు ఎక్కడ

బాగుచేశావు జగన్?

పగుళ్లుబారిన గోడలు. పెచ్చులూడిన పైకప్పులు. ప్రహరీ లేక భద్రత కరువైన బడులు. కంపు కొట్టే బాత్రూములు. మూత్రశాలలు లేకుండా బయటకు పరుగులు తీసే విద్యార్థులు. అందుబాటులో లేని తాగునీళ్లు. ఇవీ 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో కనిపించిన సర్కారు స్కూళ్ల దుస్థితి. కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడులను తీర్చిదిద్దామన్న గత వైసీపీ ప్రభుత్వ మాటలు డొల్లగానే కనిపిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. కూటమి ప్రభుత్వమైనా వీటిల్లో వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

'నాడు-నేడు' అంటూ గొప్పలు తప్ప అంతా డొల్లే

మౌలిక వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు

కూటమి ప్రభుత్వమైనా దృష్టిపెట్టాలి

రాగన్నపట్టెడలో శిథిలావస్థలో బడి భవనం

నాడు-నేడు నిధులు వెనక్కి

సూళ్లూరుపేట మండలం రాగన్న పట్టెడ జడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు భవనాలు మరమ్మతులకు గురై వినియోగించడంలేదు. నాడు-నేడు కింద రూ.1.40కోట్లు మంజూరైనా పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ప్రస్తుతం నాలుగు గదుల్లోనే మూడు నుంచి 10 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ లేదు. వంటశాలకు గది కూడా నిర్మించలేదు.

- మంగళంపాడు హైస్కూల్‌కు గతేడాది తుఫాన్ ప్రభావంతో ప్రహరీ కూలిపోయింది. ఇప్పటివరకు గోడను నిర్మించలేదు.

వెక్కిరిస్తున్న బడులు

- పెళ్లకూరు మండలంలో ఏడు ఉన్నత.. 58 ప్రాథమిక పాఠశాలలగాను కొత్తూరు, తాళ్వాయిపాడు మెయిన్, ఏడబ్బ్యా, పెళ్లకూరుమిట్ట ప్రాథమిక బడులు మినహా తక్కినవన్నీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చెన్నప్పనాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. అదనపు తరగతి నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది.
- కొత్తూరు పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడి పడుతున్నాయి. ప్రహరీ లేదు. చెంబడిపాలెం గిరిజన కాలనీ పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది. మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.
- జంగాలపల్లి పాఠశాల భవనంతో పాటు టాయిలెట్ సౌకర్యం లేదు. పెరుమాళ్లపల్లెలో టాయిలెట్ సౌకర్యం లేదు. శిరసనంబేడు రాజుపాలెం, బంగారంపేట, లక్ష్మీనాయుడు కండ్రిగ, ముమ్మారెడ్డిగుంట పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి.



చెంబేటిపాళెం పాఠశాల దుస్థితి

తడ మండలం బీవీ పాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రహరీగోడ కొంత మేరకు దెబ్బతింది. ఆర్వోప్లాంట్, బోరు పనిచేయడం లేదు. పంచాయతీ నీటితో ట్యాంకులను నింపుకొని వాడుకొంటున్నారు.

బీవీపాలెంలో దెబ్బతిన్న పాఠశాల ప్రహరీ





ఎన్టీఆర్ కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ భవనంలో నడుస్తున్న పాఠశాల

పాములు, తేళ్లు మధ్య పాఠాలు

- కోట మండలం ఎన్టీఆర్ కాలనీలో శిథిలావస్థకు చేరుకొని ఉన్న కమ్యూనిటీ హాలులో ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. పదేళ్ల కిందట పాఠశాల మంజూరైనప్పటికీ ఇప్పటివరకు భవనం లేదు. కమ్యూనిటీ హాలుకు ప్రహరీ లేక పోవడం, చుట్టూ ముళ్ల చెట్ల వల్ల పాములు, తేళ్లు బడిలోకి వచ్చి విద్యార్థులను భయపెడుతున్నాయి. వర్షమొస్తే ఉరుస్తోంది.
- వాకాడులో ప్రహరీ లేని పాఠశాలలు అనేకం ఉన్నాయి. చీమలపాడు, నిడుగుర్తి, చిన్నతోట, నవాబ్ పేట, మొనపాళెం, నలగాముల, మూలపడవ, పంబలి స్కూల్స్ అధ్వానంగా ఉన్నాయి.

ఆరుబయట చదువులు

- అవిలాల వేదాంతాపురం మండల ప్రాథమిక పాఠశాలకు గత వైసీపీ ప్రభుత్వంలో నాడు నేడు రెండో విడత కింద ఎంపికైంది. నాగరత్నమ్మ కాలనీలో కొత్త భవన నిర్మాణాలు చేపట్టారు. మొత్తంగా రూ.17 లక్షలు మంజూరు చేశారు. స్లాబ్, ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేసారు. తలుపులతో పాటు కొన్ని పనులు చేయాలి. దీంతో పాత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. డెస్కులు లేకపోవడంతో ఆరు బయట, చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు
- చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీలోని వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల చిన్నపాటి వర్షానికి ఉరుస్తోంది. జంగామాండ్లపల్లిలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు.
- పాకాల ఉన్నత పాఠశాలలో డెస్కులు లేక నేలపైనే కూర్చుంటున్నారు. మరుగుదొడ్లు అరకొరగా ఉన్నాయి. తరగతి గదులు అధ్వానంగా ఉండటంతో నాబార్డు నిధులు రూ.రెండు కోట్లు మంజూరైనా పనులు దశలో దశలోనే ఉన్నాయి. నాడు- నేడు పథకంలో రూ.1.90 లక్షలు మంజూరైనా 20 శాతం పనులు కూడా జరగలేదు. ఆర్సీపురం మండలం దేశూరికండ్రిగలో పాఠశాల భవనం దెబ్బతింది.

పశువులు, పందుల సంచారం

- గూడూరు మండలం చవటిపాళెం లోని సర్కారు బడిలో సుమారు 340 మంది చదువుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో బయట వ్యక్తుల వాహనాలు, ఇతరులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆవరణంలో పశువులు, పందుల సంచారంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- చిల్లకూరులోని శంకరన్ గిరిజన కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదు. బడి వెనుక పిచ్చి మొక్కల వల్ల విషపురుగుల భయం వెన్నాడుతోంది. బాలాయపల్లి మండలంలో జయంపు, వెంగమాంబపురం ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి.



నాగలాపురం మండలం గోళ్లవారి కండ్రిగలో..

అంతా ప్యాచ్ వర్క్

- నాగలాపురం మండలంలోని గోళ్లవారికండ్రిగ పాఠశాలకు నాడు-నేడు కింద నిధులు మంజూరైనా..చిన్నచిన్న రిపేర్లు చేసి చాలావరకు బిల్లులు స్వాహా చేశారన్న విమర్శలున్నాయి. చాలా అధ్వాన్నంగా స్కూల్ భవనం ఉంది. పైకప్పులు పెచ్చులూడిన చోట సిమెంట్‌తో కవర్ చేశారు. ● పుత్తూరు మండలం కల్యాణపురం ప్రాథమికోన్నత పాఠశాల కోసం నాడు-నేడు కింద చాకలి గుంటలో రూ20లక్షలతో పునాదులు వేసి నిలిపేశారు. పాతభవనంలో విద్యార్థుల సంఖ్యకు తగినంత గదులు లేక ఇబ్బందిపడుతున్నారు. రెప్పాలపట్టు యానాది కాలనీ ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ సగం పనులతో ఆగిపోయింది. బాత్రూం దారుణంగా ఉంది. పాఠశాల చుట్టూ రాళ్ల రప్పలతో దర్శనమిస్తోంది.

ఇరకంలోనూ ఇక్కట్లే

ఇరకం దీవిలోని ప్రాథమిక పాఠశాలలో ఇప్పుడు ఆరుగురు విద్యార్థులు ఉండగా ఒక రెగ్యులర్ ఉపాధ్యాయుడు ఉన్నారు. ఇక, ఇరకం దీవిలోని పాళెంతోపుకుప్పం (ఇరకం కుప్పం) ప్రాథమిక పాఠశాలను తమిళ మాధ్యమం పాఠశాలగా 2019 ఆగస్టులో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కనెలలోనే మూతపడి, కేవలం ప్రాథమిక పాఠశాలగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు విద్యార్థులు ఉండగా ఒక సీఆర్ఎంటి(క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్) ఉన్నారు. కాగా, ఇరకం దీవిలోని ప్రజలకు తమిళ బాషపై మక్కువ ఎక్కువ. ఈ పాఠశాలలో సరైన విద్య అందకపోవడం, రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు తమిళనాడు పాఠశాలకు వెళుతున్నారు. అదికూడా నాటు పడవల్లో పులికాట్ సరస్సులో 8 కిలోమీటర్లు ప్రయాణించి చదువుకుంటున్నారు.

మిగిలింది ఐదుగురే



ఇది వడమాలపేట మండలం తట్నేరిలోని బడి ఇది. గతంలో 20మందికి పైగా చదువుకునే వారు. వైసీపీ ప్రభుత్వం 117 జీవోతో 3, 4, 5 తరగతులు సమీపంలోని పాదిరేడు ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనమయ్యాయి. దీంతో ఐదుగురే మిగిలారు. ఇక్కడ రెగ్యులర్ టీచరు ఉన్నారు.



బీఎన్ కండ్రిగలో అఘోరితో మాట్లాడుతున్న సీఐ

పంతం వీడి.. వస్త్రాలు ధరించి..

- **శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న అఘోరి**

శ్రీకాళహస్తి/బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దిగంబరంగానే శివుడ్ని దర్శించుకుంటానని గురువారం ఉదయమంతా ఆగడం చేసిన అఘోరి.. సాయంత్రానికి పంతం వీడి వస్త్రాలు ధరించి ఆలయానికి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద దిగంబరంగా వెళ్లిన అఘోరిని అధికారులు అడ్డుకున్నారు. వస్త్రాలు ధరిస్తేనే ఆలయంలోకి అనుమతిస్తామని స్పష్టంచేశారు. దీంతో ఆమె పెట్రోల్ పోసుకుని ఆత్మార్పణ చేసుకుంటానని చెప్పగా.. పోలీసులు అనునయించి తమిళనాడు పరిధిలోని ఆరంబాకంలో వదిలిపెట్టారు. మళ్లీ ఆమె శ్రీకాళహస్తికి బయలుదేరారు. సాయంత్రం బుచ్చినాయుడు కండ్రిగ వద్దకు ఆమె కారు చేరుకోగా.. పోలీస్ స్టేషన్ వద్ద సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఆమె కారును తనిఖీ చేశారు. అఘోరి ఒంటిపై బట్టలు లేకపోవడంతో శాలువా ఇచ్చి కట్టుకోమని ఒప్పించారు. అనంతరం అఘోరిని దించి కారు తనిఖీ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి తాను వస్త్రాలు ధరించి వెళతానని ఆమె చెప్పడంతో బందోబస్తుతో పోలీసులు ఆమెను తీసుకెళ్లి, స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు.

వీఆర్‌కు ఈస్ట్ సీఐ

- **విధుల పట్ల నిర్లక్ష్యం..**

కేసుల నమోదులో అలసత్వమే కారణం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈస్ట్ సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించి నెల రోజులే కావడం గమనార్హం. విధుల పట్ల నిర్లక్ష్యం.. కేసుల నమోదులో అలసత్వంతో వ్యవహరించడమే కారణమని తెలిసింది. విధుల్లో చేరినప్పటి నుంచీ ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అసహనం వ్యక్తం చేయడం, ప్రతి రోజూ నమోదవుతున్న ఎఫ్ఐఆర్‌లను ఉన్నతాధికారులకు తెలియచేయడంలో అలక్ష్యం చూపడం, కొన్ని కేసుల వివరాలు స్టేషన్ జనరల్ డైరీలో ఎంట్రీ చేయకనే నేరుగా బాధితులతో మాట్లాడి రాజీ కుదుర్చుతున్నారనే ఫిర్యాదులు ఎస్పీ దృష్టికి వెళ్లాయి. దీంతో వీటిపై విచారణకు ఆయన ఆదేశించారు. తిరుపతి స్పెషల్ బ్రాంచి అధికారులు విచారించి నివేదిక ఇచ్చారు. దీంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. తక్షణం రిలీవ్ అయి ఎస్పీ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఈస్ట్ ఇన్‌చార్జి సీఐగా రామకృష్ణ

తిరుపతి ఈస్ట్ ఇన్‌చార్జి సీఐగా వెస్ట్ సీఐ రామకృష్ణను నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గురువారం ఈస్ట్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందచేశారు. అనంతరం డీఎస్పీ వెంకటనారాయణను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు.

గత సీఐ కూడా వీఆర్‌కే..

గతంలో ఈస్ట్ సీఐగా పనిచేసిన మహేశ్వరరెడ్డిపై అవినీతి ఆరోపణలు రావడం, టీటీడీ మార్కెటింగ్ జీఎం మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేయడానికి భయపడి అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో శ్రీనివాసులును నియమించారు. అయితే కొద్ది రోజులకే ఈయనపైనా పలు అవినీతి ఆరోపణలు రావడంతో వీఆర్‌కు బదిలీ చేశారు.

పెచ్చులూడిన విశ్రాంతి గది

- **ముగ్గురు ప్రయాణికులకు గాయాలు**
- **తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఘటన**



తిరుపతి(సెంట్రల్)నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ విశ్రాంతి హాలులో గురువారం శ్లాబ్ పెచ్చులూడి పడి ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. మొదటి ప్లాట్‌ఫారంలో ఉన్న మహిళల విశ్రాంతి హాలులో గురువారం మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్న మహిళలపై సిమెంటు పెచ్చులూడి పడ్డాయి. ముగ్గురు గాయపడడంతో వారిని రుయాస్పత్రికి తరలించారు. ఇందులో ఒకరికి తీవ్రంగానూ, మరో ఇద్దరికి స్వల్పంగానూ గాయాలయ్యాయి. పాత భవనాలకు మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో వర్షం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గతనెలలో కురిసిన తుఫాను తర్వాత మళ్లీ ఈ స్థాయిలో వర్షం పడటం ఇప్పుడే. మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. దొరవారిసత్రం 88.2 మి.మీ, బుచ్చినాయుడుకండ్రిగ 61.4, సూళ్ళూరుపేట 52.4, చిట్టమూరు 43.2 వాకాడు 36.2, నాయుడుపేట 28.8, సత్యవేడు 28.6, పెళ్లకూరు 27.6, తొట్టంబేడు 26.4, వడమాలపేటలో 24.4మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.



సూళ్లూరుపేటలో బాలికల పాఠశాల ముందు నిలిచిన వర్షపునీరు

'ఓపీ' జాప్యం కాకుండా చర్యలు

- **సోమవారం నుంచి మరో రెండు అదనపు కౌంటర్లు**

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇకపై రుయాసుపత్రిలో ఓపీ మంజూరులో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టినట్టు సూపరింటెండెంట్ రవిప్రభు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుయాలో 'ఓపీ'కకు పరీక్ష' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఓపీ మంజూరుకు ఆధార్ లింక్ చేయాల్సి ఉందని, అలాగే బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి కావడంతో కాస్త ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. ఇకపై ఆలస్యం జరుగకుండా సోమవారం నుంచి మరో రెండు అదనపు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో మొత్తం 9 ఓపీ కౌంటర్లు రోగులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇకపై ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జనరల్ ఓపీ ఉండనుంది. అత్యవసరం, చిన్నపిల్లల విభాగ ఓపీ 24 గంటలూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



గజరాజు చాటున..

గజరాజుకు అటు, ఇటు మావటిలు. ఒకటో జోరు వాన. వానకు తడవకుండా గజరాజుపై కప్పిన వస్త్రాన్ని చాటు చేసుకున్నారు. ఇలా వీరు మంగళవారం శ్రీవారి ఆలయం ముందు గజరాజు పక్కన వస్తుండగా పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

షార్‌కు చేరిన పీఎస్ఎల్వీ-సీ 59 సామగ్రి

భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి డిసెంబరులో ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్‌కు సంబంధించిన సామగ్రి గురువారం షార్‌కు చేరింది. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో సామగ్రిని షార్‌కు తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ రాకెట్ ద్వారా రోదసీలోకి పంపే బెల్జియం దేశానికి చెందిన ప్రోబా-3 ఉపగ్రహం రెండు రోజుల క్రితం షార్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లు షార్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబరు 5న షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరు పేట, ఆంధ్రజ్యోతి



ఇంటర్వ్యూ



ఆనందసాయి, టీటీడీ బోర్డు సభ్యుడు

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విశ్వకర్మ ఆనంద్‌సాయి టీటీడీ పాలకమండలి సభ్యుడయ్యారు. శంషాబాద్ సమీపంలోని రామానుజాచార్యుల ఆశ్రమ రూపకల్పనలోనూ ఆయనది ప్రధాన పాత్ర. నిజానికి ఆయన సినిమా ఆర్ట్ డైరెక్టర్. తొలిప్రేమ సినిమా కోసం ఏకంగా తాజ్‌మహల్‌నే సముద్రపు ఒడ్డున ప్రతిష్ఠించిన నిపుణుడు. యమదొంగ, సైనికుడు, గుడుంబా శంకర్, బాలు, బృందావనం, నాని, బద్రీనాథ్ వంటి వందకు పైగా సినిమాలకు కళాదర్శకుడిగా వ్యవహరించారు. ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన వాస్తుశిల్పి, పవన్ కల్యాణ్‌కి సన్నిహిత మిత్రుడు. తిరుమల రూపురేఖలను తన కళానేత్రంతో దర్శిస్తున్న ఆనంద్‌సాయితో ఆంధ్రజ్యోతి సంభాషణ...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పురా సౌందర్యవనంలా తిరుమల

"గతంలో తిరుమల ఆలయం ముందు తొలగించిన వెయికాళ్ల మండపానికి పురాతన చరిత్ర ఉంది. దాన్ని మరొక ప్రదేశంలో ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. ఆ దిశగా కూడా ఆలోచనలు చేస్తాం."

40 ఏళ్ల తర్వాత వచ్చిన విశ్వకర్మను

ఇది పెద్ద బాధ్యత. దేవుడి అనుగ్రహం. స్వామివారే డిప్యూటీసీఎం ద్వారా ఈ అవకాశాన్ని నాకు కల్పించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత టీటీడీ బోర్డులోకి విశ్వకర్మగా వచ్చింది నేనే. మనం చేసేది మనం చేయాలి. మిగతాది దేవుడే చేస్తాడు. నాతో చేయించుకుంటాడు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఇద్దరూ చాలా క్రియేటివ్. వారి ఆధ్వర్యంలో ఒక అత్యద్భుత ఆధ్యాత్మిక వాతావరణం తిరుమలలో సాకారం అవుతుందనే నమ్మకం ఉంది. తిరుమలలో ఇప్పటికే అద్భుతమైన ఆర్కిటెక్చర్ ఉంది. దీంతో పాటు శ్రీవారి ఆలయానికి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.

"నాది సంపాదించి, కుటుంబాన్ని బాగా చూసుకోవాల్సిన వయస్సు. అయినా స్వామి కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పనిచేస్తా. భయంతో, భక్తితో చేసే పని మంచి ఫలితాలనే ఇస్తుంది."

క్యూలైన్లలో కళా ప్రదర్శనలు

స్వామి దర్శనానికి 24 గంటలు, ఒక్కోసారి మూడు రోజులు కూడా నిరీక్షిస్తున్న సందర్భాలు ఉన్నాయి. క్యూలైన్లలో ఉండేవారు మానసికంగా ఒత్తిడికి గురవుతారు. దాన్ని తొలగించగలగాలి. క్యూలైన్లలో చిన్న చిన్న ఆడిటోరియంలు నిర్మించాలి. భరతనాట్యం, కూచిపూడి, హరికథలు, వాయిద్య కళాప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. స్వామివారి వైభవం, తిరుమల విశిష్టత, చరిత్ర వంటి అంశాలను యానిమేటెడ్ వీడియోలుగా రూపొందించి చూపించాలి. పిల్లల కోసం ప్రత్యేకంగా కథలు రూపొందించి ప్రదర్శించాలి. నిరీక్షణ సమయాన్ని ఉల్లాసంగా మార్చగలగాలి.

విజయనగర రాజ్యంలా తిరుమల

తిరుమల చాలా పవర్‌ఫుల్ ఎనర్జీ ఉన్న ప్రదేశం. ఇక్కడ మోడరన్ బిల్డింగులు ఎందుకు? పురాతన సంప్రదాయాలను మళ్లీ తీసుకురావాలి. ఆ సౌందర్యం తిరుమలలో కనిపించాలి. తిరుమలకు వచ్చే వారందరికీ గొప్ప ఫీల్ రావాలి. కొండెక్కగానే చెప్పులు వదిలేసేలా ఉండాలి. శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని గుర్తుచేసేలా తిరుమలను అభివృద్ధి చేయచ్చు. విజయనగర రాజ్యం గుర్తుకు రావాలి. దేశవ్యాప్తంగా పేరుపొందిన ఆర్కిటెక్చర్లు చాలా మంది ఉన్నారు. వారి సాయం తీసుకోవచ్చు. అలా మారిస్తే రాబోయే తరాలకు మంచి చరిత్ర ఇచ్చినవారమవుతాము. తిరుపతికి మన పిల్లలను తీసుకెళితే మాకు మంచి కల్చర్ వస్తుందనే అభిప్రాయాన్ని భక్తుల్లో తీసుకురావడమనదే నా కల. దర్శనాలు, వసతి, ప్రసాదాలకు క్రియేటివిటీ జతైతే భక్తులకు గొప్ప అనుభూతులు లభిస్తాయి.

"యాదాద్రి చేసే సమయంలో వచ్చినంత సపోర్ట్ తిరుమల అంజనాద్రికి రాలేదు. ఇక్కడ సిస్టమ్ చూసి భయపడి వెళ్లిపోయా. తిరుమలలో ఏం చేయలేకపోయాననే చాలా కాలం బాధపడ్డాను. టీటీడీ ఇంజినీరింగ్ విభాగాన్ని చాలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముంది."

నడకదారి తీరు మారాలి

పవన్‌కల్యాణ్‌తో కలిసి తిరుమలకు నడచి వస్తున్నపుడు ఆయన కొన్ని సూచనలు చేశారు. నడకదారిని అభివృద్ధి చేయాలన్నారు. అలిపిరి నుంచి తిరుమల వరకు ఉన్న నడక మార్గంలో కొంత స్టోన్ వర్క్ చేయాలి. ప్రత్యేకంగా కొన్ని మండపాలు, విశ్రాంతి సముదాయాలు ఉండాలి. ముఖ్యంగా గ్రీనరీని పెంచాలి. అలిపిరి దారిలో నడుస్తూ ఉంటే ఫారెస్ట్ ఫీల్ రావడం లేదు. కొంత ఆర్టిఫిషియల్ పార్క్‌ను క్రియేట్ చేయాలి. ఈ మార్గంలో ఉన్న అతిపురాతన కట్టడాలు, గోపురాలను సంరక్షించుకోవాలి.



మన్నారుపోలూరు వద్ద సబ్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నెలవల, జేసీ, ఆర్డీవో తదితరులు

జిల్లాకు రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లు

● వర్చువల్‌గా శంకస్థాపన చేసిన సీఎం చంద్రబాబు ● తూకివాకం, మాంబట్టులో నిర్మాణం

తిరుపతి కలెక్టరేట్/సూళ్లూరుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం తూకివాకం, తడ మండలం మాంబట్టులో రెండు 133 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. గుంటూరు జిల్లా నుంచి సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తూకివాకానికి సంబంధించి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, సదరన్ డిస్కం సీఎండీ సంతోష్ రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ కరుణాకర్, ఎస్ఈ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు. తూకివాకం వద్ద 133 కేవీ విద్యుత్తు స్టేషన్ ఏర్పాటుతో తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట మండలాల్లోని 50 వేల మంది వినియోగదారులు లబ్ధి పొందనున్నారని కలెక్టరు తెలిపారు. తిరుపతి ప్రాంతంలో గృహ, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తూకివాకం జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం రెడ్డి, సర్పంచ్ శివ, ట్రాన్స్‌కో ఈఈలు శ్రీనివాస్, సురేంద్ర నాయుడు, డీఈలు, ఏడీఈలు తదతరులు పాల్గొన్నారు.

● సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం తడ మండలం మాంబట్టులో నిర్మాణం చేపట్టనున్న 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు వర్చువల్ పద్ధతిలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.43.53 కోట్లతో మాంబట్టు పారిశ్రామిక వాడలో 5 ఎకరాల విస్తీర్ణంలో ఈ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశాక జేసీ శుభం బన్సాల్ చేతుల మీదుగా మన్నారుపోలూరులో శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, ట్రాన్స్‌కో ఎస్ఈ శేషా రెడ్డి, ఈఈ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, మాధవనాయుడు, తడ ఎంపీపీ రఘురెడ్డి, డీఈ బలరామ్మూర్తి, ఏడీఏ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

20.8 కిలోల గంజాయి స్వాధీనం..నలుగురి అరెస్టు

తడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టుచేశారు. డీఎస్పీ చెంచుబాబు మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. గురువారం శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు వెంటనే అక్కడికి చేరుకుని వారిని విచారించారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 20.8కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లుగా గుర్తించారు. శ్రీకాకుళం నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తేలింది. నిందితులు తమిళనాడు రాష్ట్రం మధురాంతకానికి చెందిన దేవరాజ్ అలియాస్ దేవ, నరేష్ అలియాస్ రాకేష్, తిరువల్లూరు జిల్లా కామరాజపురానికి చెందిన హరిహరన్ మార్షన్ అలియాస్ హరి, బెంగళూరు కేఆర్‌పురానికి చెందిన నారాయణగా గుర్తించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, ఇతర సిబ్బందిని అభినందించారు. అలాగే వారం రోజుల క్రితం 48 కేజీల గంజాయి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని ఈ రెండు కేసుల్లో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డు కోసం ప్రభుత్వానికి సిఫారస్సు చేస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు వెల్లడించారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

గల్లా ఇంటికి టీటీడీ చైర్మన్



తిరుపతి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం అమరరాజ కంపెనీ వద్దగల మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఇంటికి వెళ్లారు. అరుణకుమారితో పాటు అమరరాజ గ్రూప్స్ అధినేతలు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా జయదేవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టీటీడీ చైర్మన్‌ను గల్లా కుటుంబ సభ్యులు సత్కరించారు. ఇటీవల విడుదలైన గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని బీఆర్ నాయుడు కొనుగోలు చేశారు. పుస్తకాలు అమ్మడం ద్వారా వచ్చే మొత్తాన్ని పేద విద్యార్థుల చదువు కోసం ఉపయోగించాన్న అరుణకుమారి నిర్ణయాన్ని ఆయన అభినందించారు. అనంతరం టీటీడీ పాలకమండలి సభ్యుడు ఓవీ రమణ నివాసానికి బీఆర్ నాయుడు వెళ్లి మర్యాదపూర్వకంగా పలకరించారు.

పాఠశాలల్లో విధిగా స్కౌట్, గైడ్ యూనిట్స్

విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్



తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్, గైడ్ యూనిట్స్ విధిగా ఏర్పాటు చేస్తామని డీఈఓ కేవీఎస్ కుమార్ అన్నారు. మంగళం జిల్లా పరిషత్ ఉన్నత (ట్రెండ్స్) పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ 2024-25వ సంవత్సరంలో జిల్లాలో 1,500 పాఠశాలల్లో స్కౌట్ శాఖలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి జిల్లాలో 40పాఠశాలలకు రూ.50వేల చొప్పున సమగ్రశిక్ష ద్వారా నిధులు ఇవ్వడమే కాకుండా ప్రత్యేక కార్యాచరణతో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం బేస్‌బాల్ క్యాంపు క్రీడాకారులను అభినందించారు. జిల్లా పయోజన వనరుల కమిషనర్ ఎం.ఎం.రెడ్డి, కార్యదర్శి జయరాం వార్షిక నివేదిక సమర్పించి, ఫ్లాగ్ డే స్టిక్కర్స్‌ను విడుదల చేశారు. నిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు స్కార్ఫ్ అధికారులను సత్కరించారు. మాస్టర్స్ అడ్వాన్స్ కోర్స్ చేసిన వారికి గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌నాయుడు, జయరామయ్య, మునిరత్నం, వెంకటేశు, రామకృష్ణ, వెంకటాద్రి, మురళి, హేమకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

● మూడు రోజుల పాటు సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనల హోరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు



యువతరంగ్ లోగో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి యువ తరంగ్-2024 కార్యక్రమం నిర్వహించనున్నారు. యూనివర్సిటీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని సృజనాత్మక కళలను వెలికి తీసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విజేతలను జాతీయ పోటీలకు తీసుకెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు ఆవిష్కరించారు. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. వారికి అవసరమైన రవాణా, భోజనం, వసతి, వేదికలు వంటి సదుపాయాలు సిద్ధం చేసినట్టు తెలిపారు. డ్యాన్స్, మ్యూజిక్, లిటరరీ ఈవెంట్స్, థియేటర్ ఈవెంట్స్, ఫైన్ ఆర్ట్స్ ఇలా ఐదు విభాగాలుగా 27 ఉప అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే 35 కళాశాలలకు చెందిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవన్ నుంచి మెయిన్ బిల్డింగ్, ఓల్డ్ ఎంబీఏ బిల్డింగ్, శ్రీవారి ఆలయం, పరిపాలనా భవనం మీదుగా శ్రీనివాస ఆడిటోరియం దాకా ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవినాయుడు అతిథులుగా పాల్గొంటారన్నారు. అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కల్యాణ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రిన్సిపాళ్లు సుధారాణి (ఆర్ట్స్), రామకృష్ణారెడ్డి (సైన్స్), నరసయ్య (కామర్స్), దామోదరరెడ్డి (ఇంజినీరింగ్), డాక్టర్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్



● వెంటనే ఈకేవైసీ చేసుకోవాలన్న జేసీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని జేసీ శుభం బన్సల్ చెప్పారు. తన చాంబరులో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు కోసం ఇది వరకే గ్యాస్ కనెక్షన్ కలిగి వుండాలని, ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరిగా వుండాలన్నారు. ఈకేవైసీ చేయకుంటే సబ్సిడీ డబ్బులు అకౌంటులో పడవన్నారు. దీనికోసం ఆఖరు తేదీ అంటూ ఏమీ లేదని గ్యాస్ పంపిణీదారులు లబ్దిదారుల ఇళ్ళ వద్దకే వచ్చి ఈకేవైసీ చేసుకుంటారని చెప్పారు. ఎవరూ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవచ్చన్నారు. ఈకేవైసీ పూర్తయిన వారికి వారి అకౌంట్లలో నగదు జమవుతుందని జేసీ పేర్కొన్నారు. వీటిపై సందేహాలుంటే 1967కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు.

జీవీఆర్ పరిశ్రమలపై ఐటీ దాడులు

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడులోని జీవీఆర్ (సాగర్‌గ్రంధి ఎక్స్‌పోర్ట్) రొయ్యల పరిశ్రమలో గురువారం ఆదాయపన్నుశాఖ అధికారులు తనిఖీలు చేశారు. సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని ఈ తనిఖీలు చేపట్టారు. ఈ రొయ్యల పరిశ్రమ మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, భీమవరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ది. ఈయనతో పాటు, వారి కుటుంబసభ్యులకు చెందిన 11 పరిశ్రమల్లోనూ ఆదాయ పన్నుశాఖ అధికారులు ఏకకాలంలో సోదాలు చేస్తున్నట్లు సమాచారం.

పుష్పయాగానికి నేడు అంకురార్పణ

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం జరగనున్న పుష్పయాగానికి శుక్రవారం అంకురార్పణ జరుగనుంది. రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య అంకురార్పణ నిర్వహించి ఆచార్య రుత్విక్‌వరణం చేపట్టనున్నారు. శనివారం శ్రీవారి ఉత్సవమూర్తులను ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగాన్ని చేపట్టనున్నారు.

హత్యాయత్నం కేసులో ఆటోడ్రైవర్ అరెస్టు



శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో మునికుమార్ అనే ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు... శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మునికుమార్, అతడి స్నేహితుడు సతీష్‌కుమార్ ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తుంటారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో ఆగ్రహించిన మునికుమార్ కత్తి వెంటపెట్టుకుని ఈనెల 4వ తేదీన ఉదయం 4 సమయంలో సతీష్ కుమార్ ఇంటి వద్దకు వెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన అతడి భార్య కీర్తన, మామ గణేష్‌లను కత్తితో గాయపరిచాడు. వారి ఫిర్యాదు సీఐ గోపి హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ముక్కంటి ఆలయ సమీపంలోని సన్నిధి వీధిలో టూరిస్టు బస్టాండు వద్ద మునికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరా

నాయుడుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరాపెట్టిన సంఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. నాయుడుపేట-మేనకూరులోని నివాసం ఉంటున్న సాయి అనే యువకుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ కడపకు చెందిన యువకుడు నమ్మబలికాడు. దీంతో ఆ యువకుడికి సాయి రూ.10 లక్షలు ఇచ్చారు. ఉద్యోగం ఇప్పించక పోగా, అతడి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో బధితుడు గురువారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 66,168 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,299 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

ఎస్వీయూకు ప్రపంచ గుర్తింపు

● క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలో మొదటి స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్-2025లో 581-600 మధ్య ర్యాంకు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలన్నింటిలో మొదటి స్థానాన్ని పొందింది. పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, అంతర్జాతీయ సంబంధాలు తదితర అంశాల్లో ప్రమాణాలను పరిశీలించి ఈ గుర్తింపును ప్రకటించారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగుల సమిష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి







ఆర్అండ్బీ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని చుట్టిముట్టిన నీరు, బాలికల పాఠశాల ప్రాంగణమంతా ఇలా.. ● అర్అండ్బీ బంగ్లా ప్రవేశద్వారం వద్ద

సూళ్లూరుపేటలో భారీ వర్షం

● బాలికల పాఠశాలను చుట్టుముట్టిన వర్షపునీరు

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో భారీ వర్షం కురవడంతో ప్రధాన వీధులతో పాటు పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. గురువారం తెల్లవారుజామున నుంచి విడితల వారీగా మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ప్రధాన రహదారి జీఎన్టీ రోడ్డు, సాయినగర్, షార్ సర్కిల్, గురుకుల పాఠశాల రోడ్డు మార్గంలో వర్షపునీరు నిలబడడంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ మంతా జయలమయంగా మారింది. బాలికల ఉన్నత పాఠశాల ముందు వర్షపునీటితో పాటు మురుగునీరు చేరడంతో ప్రాంగణమంతా మురుగుతో నిండిపోయింది. అదేవిధంగా ఆర్ అండ్బీ బంగ్లా, ఆర్అండ్బీ ఇంజనీరింగ్ కార్యాలయాలను చుట్టూ వర్షపునీరు చేరింది. అధికారులకు ఇబ్బందులు తప్పలేదు. పట్టణంలో పలుచోట్ల మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా ప్రజలకు బాధలు తప్పడం లేదు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అందరూ బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. స్వేచ్ఛ పేరుతో ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, పద్మావతి, భాస్కర్‌రావు, చంద్రమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లను రద్దు చేయాలి



గూడూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణానికి చెందిన కొందరు అగ్రకులస్తులు నకిలీ బీసీ సర్టిఫికెట్లతో చలామణి అవుతున్నారని అధికారులు విచారించి అలాంటి నకిలీ సర్టిఫికెట్లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యవర్గ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యవర్గ సభ్యులు నిరసన తెలియజేశారు. రామారావు, భాస్కర్, శంకరయ్య, శ్రీనివాసులు, సతీష్ పాల్గొన్నారు.

ప్రతిభచాటిన క్రీడాకారులకు అభినందనలు



గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అర్చరీ పోటీలలో ప్రతిభచాటిన అర్జున అర్చరీ అకాడమి క్రీడాకారులను గురువారం స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవాసంస్థ నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మన్యంజిల్లా జోగింపేటలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలలో అర్జున అకాడమీకి చెందిన క్రీడాకారులు లోకేష్, షణ్ముకి, తరుణీష్‌జత్య, నిషిత, శశిధర్, కిరణ్‌తేజ, భాషిత ప్రతిభచాటి మెడల్స్ సాధించారన్నారు. క్రీడాకారులతో పాటు కోచ్ శివశంకర్‌ను అభినందించారు. శ్రీనివాసులు, పూర్ణా, భాను, పెంచలయ్య, నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

చెరువులా మారిన పాత జీఎన్‌టీ రోడ్



కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకే నాయుడుపేట - శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డులో అడుగడుగునా నీటి గుంతలు ఏర్పడ్డాయి. ఆ నీటి గుంతల్లో ఆటోలు, ఇతర వాహనాలలో ప్రయాణించడం ప్రజలకు నరకప్రాయంగా ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ గుంతలో పడవలు నడపచ్చని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.

- నాయుడుపేట

జాతీయస్థాయి క్రీడలకు కృపాప్రిన్సి



రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న కృపాప్రిన్సి

నాయుడుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల్లో అండర్-14 బాలికల విభాగంలో చింతపల్లి కృపాప్రిన్సి మంచి ప్రతిభ కనపరిచినట్లు ఎస్ఎస్ఎఫ్ డైరెక్టర్ మామిడి లక్ష్మయ్య తెలిపారు. స్థానిక బాలభారతీలో 7వ తరగతి చదువుతున్న కృపాప్రిన్సి 600 మీటర్ల పరుగుపందెంలో 3వస్థానంలో నిలిచి క్యాంస పతకం, 4/100 రిలే పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజక పతకం సాధించినట్లు వెల్లడించారు. కృపాప్రిన్సి జాతీయస్థాయిలో నిర్వహించే పాఠశాల క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాహాపై విచారణ

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కోట పరిధిలోని శ్యామసుందరపురం రేషన్ దుకాణంలో బియ్యం స్వాహాపై విచారణ జరిపినట్లు తహసీల్దారు జయజయరావు , సీఎస్‌డీటీ మల్లికార్జున్ రావులు గురువారం తెలిపారు. ఇక్కడ రేషన్ దుకాణం నడుపుతున్న పాత డీలర్‌పై 3,470 కేజీల బియ్యం స్వాహాచేశారని గ్రామస్తులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దారు, సీఎస్‌డీటీ ఆర్ఐ మధులత, వీఆర్వో రమణయ్య, శ్రీనివాసులును రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. బియ్యం స్వాహా వాస్తవమేనని నిర్ధారించారు. నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు వెల్లడించారు.

రసాయన ఎరువులతో భూమి నిర్జీవం

చిట్టమూరు, నవంబరు 7(ఆంధజ్యోతి): రసాయన ఎరువుల వినియోగంతో భూమి నిర్జీవంగా మారుతుందని జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. గురువారం ఏవో సుచేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో చిట్టమూరులో రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాల్, చిట్టమూరు ఏవో సుచేంద్ర ప్రసాద్‌లు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గూడూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురు వారం అయ్యప స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. స్థానిక కాశీ లేఅవుట్‌లో నూతనంగా అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా విశేషపూజలు జరిపారు. సాయంత్రం గ్రామోత్సవం జరిపారు. రాత్రికి ఆలయంలో స్వామివారి పడిపూజ జరిపించారు.

13న పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ఓజిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 13న పంచాయతీ అభివృద్ధి కోసం నిర్దేశించిన ప్రణాళికలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, వెలుగు సిబ్బంది తదితరులు హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

పేదల సొంతింటి కల చంద్రబాబుతోనే సాధ్యం



లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వెంకటగిరి, నవంబరు 7 : (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేర్చడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గుండ్రసముద్రం ఎస్సీ కాలనీలో 24 మంది లబ్ధిదారులకు 3 సెంట్ల స్థలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లను కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో అధునాతన వసతులతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో అత్యవసర చికిత్సా విభాగం భవనాన్ని అన్ని వసతులతో నిర్మించి మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ఎంపీపీ తనూజరెడ్డి, టీటీఎస్ చైర్మన్ స్వర్ణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత శాతం పెంచడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏవో రఘురామయ్య

దొరవారిసత్రం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సంపూర్ణ అక్షరాస్యత శాతాన్ని పెంచడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్య తెలియజేశారు. గురువారం మండల సమావేశ మందిరంలో మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వెలుగు వీవోఏలు, ఉల్లాస్ కార్యక్రమం నిర్వాహక వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో అక్షరాస్యత, అక్షర దీపం కార్యక్రమాలతో ప్రతి ఇంటా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని చేపట్టిన కార్యక్రమమే ఉల్లాస్ అని తెలిపారు. మండలంలో మొదట విడతగా పొదుపు మహిళా సంఘాల ద్వారా ఇప్పటికే గుర్తించిన 370 మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. వయసుతో సంబంధం లేకుండ చదువు ఎలా నేర్పించాలనే అంశాలపై ఎంఈవో క్రిష్ణయ్య వారికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మునిరాజ, సీసీ పాల్గొన్నారు.

ఓజిలి రైతులకు గంగనీరు అందించండి



ఎమ్మెల్యే విజయశ్రీతో మాట్లాడుతున్న విజయకుమార్‌నాయుడు

ఓజిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండల రైతాంగానికి తెలుగు గంగ ద్వారా సాగునీటిని అందించాలని టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని కోరారు. గురువారం సూళ్లూరుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేని కలిశారు. మండలంలో ఈ పాటికే సాగు చేపట్టాల్సిన రైతాంగం సరైన వర్షాలు పడకపోవడంతో నార్లు పోసుకోకుండా ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో మండలంలోని చెరువులకు గంగనీటిని విడుదల చేస్తే రైతులు నార్లు పోసుకుని సాగుచేడతారని ఆయన తెలిపారు. గంగ అధికారులతో మాట్లాడి ఓజిలి మండలానికి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నైపుణ్య అభివృద్ధి సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

దొరవారిసత్రం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఇంటింటా నైపుణ్య అభివృద్ధి సర్వేపై గురువారం దొరవారిసత్రం మండల కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులకు శిక్షణ జరిగింది. ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబంలో సభ్యుల వివరాలు, నిరుద్యోగ యువత వివరాలు, వారికి ఎటు వంటి శిక్షణ ఇస్తే, ఉద్యోగం లభిస్తుంది వంటి అంశాలపై సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ సర్వే చేసే విధానంపై శ్రీసిటీలోని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ మేనేజర్ మురళి గ్రామ సచి వాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శిలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో రఘురామయ్య పాల్గొన్నారు.

బదిలీ అయిన వీఆర్వోకు ఘనసన్మానం

పెళ్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారంపేట వీఆర్వోగా విధులు నిర్వహించి బదిలీపై గూడూరు వీఆర్వోగా వెళ్లిన రవిచంద్రను గురువారం రెవిన్యూ అధికారులు సన్మానించారు. పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్ తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు తేజ, కళ్యాణి, సుమతి తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక విద్యార్థులతో నోరు, రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. హెచ్‌ఈవో పెంచులయ్య, డివిజన్ ఎస్ఈవో రామరాజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం కేశవరంలో జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



సురేష్‌బాబుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేష్ బాబుకు అనంతరపురంలో ఎస్కే యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ గీతాంజలి పర్యవేక్షణలో యాన్ ఎన్‌యాంసెడ్ ఎనర్జీ ఆర్పీమైడేషన్ ట్రస్టు మోడల్ ఫర్ ఇంప్రోవైసింగ్ ది లైఫ్‌టైమ్ ట్రూ హూరిటిక్ట్ అప్రోసెస్ ఆన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్' అనే అంశంపై సురేష్‌బాబు పరిశోధనలు చేశారు. ఈ క్రమంలో ఆయనకు వర్శిటీ డాక్టరేట్ అందించింది. దీంతో గురువారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణరావులు సురేష్‌బాబును అభినందించారు.

గంగమ్మ ఆలయంలో కుంభాభిషేకాలు

కోట: మండలంలోని వెంకన్నపాళెం గ్రామ దేవత గంగమ్మతల్లి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మహా కుంభాభిషేకాలు జరిగాయి. అమ్మవారి ఉత్స వర్లను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మ వారి జీవిత చరిత్రను కథకులు వివరించారు.

డిప్యూటీ సీఎంను కలసిన బంగారంపేట సర్పంచ్

పెళ్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను గురువారం అమరావతిలో బంగారంపేట సర్పంచ్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి నాగేంద్రప్రసాద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేద్దాం

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిరక్షరాస్యులకు విద్యను బోధించే వలంటీర్లుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రధానకార్యదర్శి నెలటూరు చిరంజీవి, అటల్ ఎడ్యుకేషన్ ఏపీవో ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో గోపి, ఏపీఎం రత్నయ్య, ఎంఈవో రఫూఫ్, సీసీలు పాల్గొన్నారు.

గూడూరులో ఓ మోస్తరు వర్షం

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. అరగంటపాటు వర్షం కురవడంతో పలు చోట్ల రోడ్లపై వర్షపునీరు నిల్వచేరింది. పాద చారులు, వాహనదారులు అవస్థలుపడ్డారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు: డీఎస్పీ

నాయుడుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో డీఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆటో నడిపేటప్పుడు డ్రైవర్లు మద్యం సేవించరాదని డీఎస్పీ సూచించారు. ముగ్గురు లేదా నలుగురు కంటే ఎక్కువ మంది ప్రయాణికులను తీసుకెళ్లకూడదని తెలిపారు. అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: ఆటోలు నడిపే సమయంలో డ్రైవర్లు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆటోలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ఆటో డ్రైవర్లకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ఖాకీ చొక్కాలను ధరించడంతోపాటు సరైన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు.

నిరక్షరాస్యతను పారదోలండి

డక్కిలి, నవంబరు 7 : (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యతను పారదోలేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో అక్షరాస్యత కార్యక్రమం అమలుకు సంబంధించి వలంటీర్లు, వీవోలు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో-2 జగదీష్ బాబు, వెలుగు ఏపీఎం జమునారాణి, సీసీలు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లోని శ్మశాన వాటికలో గురువారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో ముళ్లచెట్లు తొలగించారు. చదును చేశారు. ఈ పనులను స్థానిక టీడీపీ నాయకులు సురేంద్ర, కృష్ణయ్య, రమణయ్య, శ్యామ్‌బాబు పర్యవేక్షించారు.

నైపుణ్య గణనపై శిక్షణ

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని 16 సచివాలయాలలోని సిబ్బందికి నైపుణ్యగణనపై శిక్షణ ఇచ్చారు. ఈ సర్వేను ఇంటింటా తిరిగి త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో వేణు కోరారు.

చిట్టమూరు: మండల పరిధిలోని మహిళా సమైఖ్య భవనంలో నైపుణ్య గణనపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి యల్లయ్య, డిజిటల్ అసిస్టెంట్‌లు నాగరాజు, అలీమ్ ఉర్దీన్‌లు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటిని సర్వే చేసి వివరాలు సేకరించాలని తెలిపారు.

బాలాయపల్లి: ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ మండల స్థాయి అధికారులకు నైపుణ్య గణనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోహన్ రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అవసరమైన మేరకే వినియోగించాలి



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మి

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను వాడాలని జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు లక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందదిన వ్యవసాయాధికారులకు నైపుణ్యత పెంపుదల మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి ద్వారా అన్ని గ్రామాల్లో రైతులకు పంటల సాగులో ఎరువులు వినియోగం తదితర అంశాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఎల్లప్పుడూ గ్రామ విస్తరణాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. తెగుళ్ల సోకకుండా ఉండేందుకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించేలా అధికారులు ప్రత్యేక చొరవతీసుకోవాలని ఏవో శశిధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఏడీఏ అనిత, ఏవోలు కవిత, కాంచన, జ్యోతిర్మయి, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

గోతులమయంగా జీఎన్‌టీ రోడ్

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్ అధ్వానంగా మారింది. గురువారం తెల్లవారు జామున నుంచి కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో ఉన్న చిన్నగోతులు పెద్దవిగా మారడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. స్థానిక హోలీక్రాస్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు దాదాపు కిలో మీటరు మేర పట్టణ ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో గోతులు పూడ్చకపోవడంతో ఐదేళ్ల నిర్లక్ష్యానికి జీఎన్‌టీ ప్రధాన రోడ్డు ప్రయాణికులకు నరకాన్ని చూపుతోంది. కూట మి ప్రభుత్వం రావడంతో రోడ్డుకు మోక్షం కలుగుతుందని ప్రజలు ఎదరుచూస్తున్నారు.







ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డు ఇలా.. ● ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో నడిరోడ్డు పై ఏర్పడిన గుంత ● రైల్వేస్టేషన్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు